
గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులకు భూమి పూజ

● కడప-రేణిగుంట రహదారి పనులు ప్రారంభం
● 122 కిలోమీటర్లు.. రూ.3232 కోట్లు

4

ఎవరెవరికి ఎంతంటే...!

● కట్టా రాజు 'డైరీ'లో ముడుపుల చిట్టా
● ఎక్సైజ్ అధికారులు, స్థానిక పోలీస్‌స్టేషన్‌కు భారీగా ముడుపులు..?
● వెలుగులోకి సంచలన విషయాలు
● సిట్ అధికారుల ఆరా
● ముడుపులు తీసుకున్న అధికారుల్లో గుబులు



ములకలచెరువు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంచలనంగా మారిన ములకలచెరువు నకిలీ మద్యం కేసు విచారణలో లోతుగా వెళ్లే కొద్దీ సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. సిట్ అధికారులనే ఆశ్చర్యపరిచే ఎన్నో సంచలన నిజాలు బయటకు వస్తున్నాయి. తాజాగా ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేంద్రానికి ఇన్‌చార్జ్‌గా వ్యవహరించిన ప్రధాన నిందితుడు మద్దేపల్లి జనార్దన్‌రావు అనుచరుడైన కీలక నిందితుడు కట్టా రాజు (ఏ2) డైరీలో రాసిన విషయాలు బయటకు వచ్చాయి. నకిలీ మద్యం తయారీ, బెల్ట్‌షాపులకు రవాణా, ఆర్థిక లావాదేవీలు, అధికారులకు ఇచ్చిన ముడుపుల వివరాలు అన్నీ డైరీలో రాశాడు. గత నెల 3వ తేదీ నకిలీ మద్యం తయారీ కేంద్రంపై ఎక్సైజ్ పోలీసులు దాడులు చేసిన సందర్భంగా కట్టా రాజు రాసిన డైరీ దొరికింది. అప్పట్లో ఈ విషయం ఆంధ్రజ్యోతిలో 'ఆ డైరీలో ఏముంది' అన్న వార్త ప్రచురితం కాకడంతో సంచలనంగా మారి తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ క్రమంలో గత నెల 9వ తేదీ కీలక నిందితుడు కట్టా రాజును ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. అప్పట్లో అతడి వద్ద నుంచి ల్యాప్‌టాప్ కూడా స్వాధీనం చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం నకిలీ మద్యం మూలాలు బయటకు తీసేందుకు సిట్‌ను ఏర్పాటు చేసింది. సిట్ అధికారులు రంగంలోకి దిగి ములకలచెరువు కేసుకు సంబంధించి విచారణ చేపట్టారు. ములకలచెరువు కేసుకు సంబంధించి ఎఫ్ఐఆర్, రికార్డులు, పత్రాలు, కట్టా రాజు రాసిన డైరీని విజయవాడకే తెప్పించుకున్నారు. డైరీలో కట్టా రాజు అధికారులకు ఇచ్చిన ముడుపుల విషయాలను రాశాడు. అందులో ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, డీటీఎఫ్ స్క్వాడ్, ఎక్సైజ్ స్టేషన్ తదితరులకు ఇచ్చిన ముడుపుల విషయాలను రాసినట్లు తెలిసింది. అలాగే ములకలచెరువు పోలీస్‌స్టేషన్‌కు ప్రతి నెల రూ.30 వేలు ముడుపులు ఇచ్చినట్లు కట్టా రాజు డైరీలో రాసినట్లు విశ్వసనీయ సమాచారం. మే నుంచి సెప్టెంబరు వరకు పోలీస్‌స్టేషన్‌కు ముడుపులు పంపినట్లు ఎక్సైజ్ శాఖలో చర్చనీయాంశంగా మారింది.

కట్టా రాజు రాసిన డైరీని సిట్ అధికారులు తమ వద్ద ఉంచుకుని ఎవరెవరికి ముడుపులు అందాయో ఆరా తీస్తున్నట్లు సమాచారం. దీంతో నకిలీ మద్యం తయారీ వ్యవహారంలో ముడుపులు తీసుకున్న అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ముడుపులు తీసుకున్న తమపై చర్యలు తీసుకుంటారేమోనని భయపడుతున్నారు. ప్రస్తుతం ఎక్సైజ్ శాఖలో డైరీ విషయం దుమారం రేపుతోంది. కాగా కట్టా రాజును అరెస్టు చేసిన సమయంలో డైరీ, ల్యాప్‌ట్యాప్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ పోలీసులు రిమాండ్ రిపోర్టులో కూడా పొందుపరిచారు. ములకలచెరువు కేంద్రం నుంచి నకిలీ మద్యం సరఫరా చేసిన బెల్ట్‌షాపుల నిర్వాహకుల గుండెల్లో గుబులు పట్టుకుంది. నకిలీ మద్యం సరఫరా చేసిన బెల్ట్‌షాపుల వివరాలను కూడా కట్టా రాజు డైరీలో రాశాడు. నకిలీ మద్యం అమ్మిన 50కుపైగా బెల్ట్‌షాపుల వివరాలు, బెల్ట్‌షాపుల నిర్వాహకులు కట్టా రాజుకు చేసిన నగదు లావాదేవీల వివరాలు కూడా ఉన్నాయి. డైరీ ఆధారంగా బెల్ట్‌షాపుల నిర్వాహకులను ఎక్సైజ్ పోలీసులు ములకలచెరువు ఎక్సైజ్ స్టేషన్‌కు పిలిపించి స్టేట్‌మెంట్ రికార్డు చేస్తున్నారు. పలువురు బెల్ట్‌షాపు నిర్వాహకుల స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసుకోవడంతో కొందరు భయపడి అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలిసింది.


కట్టా రాజు (ఫైల్)


ములకలచెరువు ఎక్సైజ్ స్టేషన్

నేడు తంబళ్లపల్లె కోర్టుకు జనార్దన్‌రావు

ములకలచెరువు నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న అద్దేపల్లి జనార్దన్‌రావును శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు తంబళ్లపల్లె కోర్టుకు తీసుకురానున్నారు. ములకలచెరువుతో పాటు ఇబ్రహీంపట్నం నకిలీ మద్యం తయారీ కేసుల్లో ప్రధాన నిందితుడు జనార్దన్‌రావు ప్రస్తుతం నెల్లూరులోని కేంద్ర కారాగారంలో ఉన్నాడు. ఇబ్రహీంపట్నం కేసులో అరెస్టై రిమాండ్‌లో ఉన్న జనార్దన్‌రావుతో పాటు మరో నలుగురిని ములకలచెరువు కేసులో అరెస్టు చూపేందుకు అనుమతి ఇవ్వాలని ఎక్సైజ్ పోలీసులు దాఖలు చేసిన పీటీ వారెంట్‌కు తంబళ్లపల్లె కోర్టు అనుమతి ఇచ్చింది. దీంతో నెల్లూరు సెంట్రల్ జైలులో ఉన్న జనార్దన్‌రావుతో పాటు అతడి తమ్ముడు జగన్‌మోహన్‌రావు, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, రమేశ్‌బాబు, అల్లాబక్షులను ప్రత్యేక బలగాల మధ్య ఎక్సైజ్ పోలీసులు తంబళ్లపల్లె కోర్టుకు తీసుకురానున్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

● కలెక్టర్ నిశాంత్‌కుమార్


మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి (నేతాజీ సర్కిల్), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టళ్లలో, పాఠశాలల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం అమరావతి నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ రైతుల నుంచి ధాన్యం సేకరణ, ప్రజల నుంచి వివిధ అంశాలపై సేకరించిన ప్రజాభిప్రాయ సేకరణ, గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా సిటిజన్ సర్వే, సంక్షేమ హాస్టళ్లలో పారిశుధ్యం తదితర అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ నిశాంత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ జిల్లాల్లో గంజాయి ఉత్పత్తిదారులు, సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పౌరసరఫరాలశాఖ ద్వారా బియ్యం సేకరణ త్వరగా జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చెరువుల మరమ్మతులకు రూ.కోటి మంజూరు

కలికిరి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లె మండలంలో ఆరు సాగునీటి చెరువుల మరమ్మతులకు రూ.1.05 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. జలవనరుల శాఖ చీఫ్ ఇంజినీరు పంపిన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. మండలంలోని మద్దిరేవుల గ్రామంలోని నాగమునెమ్మ చెరువుకు రూ.13.70 లక్షలు, గంగయ్య కుంటకు రూ.18.50 లక్షలు, కుర్నూతల గ్రామంలో రాజులపల్లె సమీపంలోని మంగలోనికుంటకు రూ.15.80 లక్షలు, వడ్డెపల్లె సమీపంలోని నల్లతుమ్మ చెరువుకు రూ.23.70, వై.వడ్డెపల్లె సమీపంలోని జలలోల చెరువుకు రూ.16 లక్షలు, వడ్డెపల్లె కుంటకు రూ.17.50 లక్షలు వంతున మంజూరు చేశారు. నిబంధనల మేరకు పనులు చేపట్టాలని ఆదేశిస్తూ జల వనరుల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ గురువారం నిధుల మంజూరుకు సంబంధించిన ఆదేశాలు జారీ చేశారు.

కర్ణాటక అండర్-12 క్రికెట్ జట్టుకు యగ్నేశ్‌రెడ్డి


అండర్-12 జట్టుకు ఎంపికైన యగ్నేశ్‌రెడ్డి

పీలేరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ (కేఎస్‌సీఏ) అండర్-12 జట్టుకు పీలేరుకు చెందిన పల్లవోలు యగ్నేశ్‌రెడ్డి ఎంపికయ్యాడు. పీలేరుకు చెందిన ప్రముఖ టీడీపీ నేత, వ్యవసాయ శాస్త్రవేత్త పల్లవోలు హేమచంద్రారెడ్డి కుమారుడైన యగ్నేశ్‌రెడ్డి బెంగళూరులో విద్యాభ్యాసం చేస్తున్నాడు. యగ్నేశ్‌కు క్రికెట్‌పై ఉన్న ఆసక్తిని గమనించి తండ్రి ప్రోత్సహించడంతో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు. కాగా పీలేరులోని టీడీపీ నేతలు, పీలేరు ప్రజలు, కుటుంబ సభ్యులు అభినందించారు.

నేటి నుంచి శుభ కార్యాలకు సెలవు

● శుభ ఘడియలు ఫిబ్రవరిలోనే



కలికిరి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గత ఐదు నెలలుగా తెలుగు లోగిళ్లలో హోరెత్తించిన శుభ కార్యాల హడావుడికి శుక్రవారం నుంచి తెరపడనుంది. ఇక 83 రోజుల సుదీర్ఘ విరామం అనంతరం ఫిబ్రవరి 18వ తేదీ తరువాతనే తిరిగి శుభ ఘడియలు ప్రారంభం కానున్నాయని పండితులు చెబుతున్నారు. నవంబరు నెల చివరలో ఒక రెండు సర్దుబాటు ముహూర్తాలున్నా శుక్రవారం నుంచి శుక్ర మౌఢ్యమి ప్రారంభమవుతున్నట్లు పురోహితులు వివరిస్తున్నారు. మార్గశిర మాసం మొత్తం మూఢమితో నిండి ఉంటుందని, అనంతరం పుష్య మాసంలో యథావిధిగా ఉత్తరాయణ సంక్రాంతి శూన్య మాసంలో శుభ కార్యాలకు సెలవుగా పేర్కొంటున్నారు. ఇక మాఘమాసంలో వసంత పంచమి విశేషాలున్నా ఈ ఏడాది ఈ మాసంలో కూడా మూఢమి రావడంతో మొత్తం మాఘమాసం కూడా ఫిబ్రవరి 17వ తేదీ శివరాత్రి వరకు శుభ ముహూర్తాలకు ఏమాత్రం అవకాశం లేదంటున్నారు. కొంతలో కొంత ఆశాజనకంగా రాబోయే కొత్త సంవత్సరంలో మంచి ముహూర్తాలకు లోటుండదని అంటున్నారు. 2026 జనవరి పూర్తిగా, ఫిబ్రవరిలో 18 నుంచి సంవత్సరం పొడవునా అన్ని నెలల్లోనూ ముహూర్తాలకు కొదవ ఉండదని వివరిస్తున్నారు.

రైతన్నా...మీకోసం ఆకస్మిక తనిఖీ


నారాయణనెల్లూరులో రైతన్నా మీకోసం సర్వే కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న సబ్‌కలెక్టర్ భావన

పెనగలూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలో జరుగుతున్న రైతన్నా.. మీకోసం సర్వే కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం రాజంపేట సబ్‌కలెక్టర్ భావన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చేస్తున్న సర్వే కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా చూశారు. ఏపీఎంఎస్ యాప్ పనితీరు ఎలా ఉంది, దాని వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలు, లాభాల గురించి అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయంలో ప్రజల ద్వారా ప్రభుత్వానికి వెళుతున్న సమస్యలతో పాటు ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందుతున్న లబ్ధి గురించి కూడా ఆమె వాకబు చేశారు. కార్యక్రమంలో ఏవో సుబ్రహ్మణ్యం, తహసీల్దారు అమరేశ్వరి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె జిల్లాగా అధికారిక ప్రకటన

● ప్రిలిమినరీ నోటిఫికేషన్ విడుదల
● అభ్యంతరాలు, సలహాలకు నెల రోజుల గడువు



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): మదనపల్లెను జిల్లాగా ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ (పూర్తి అదనపు బాధ్యతలు) సాయికుమార్ గురువారం రాత్రి ప్రిలిమనరీ నోటిఫికేషన్ విడుదల చేశారు. దీంతో మదనపల్లె కేంద్రంగా మదనపల్లె జిల్లా ప్రకటన అధికారికంగా వెలువడినట్లైంది. మెరుగైన పరిపాలన, అభివృద్ధి కోసం మదనపల్లె జిల్లాను ఏర్పాటు చేస్తున్నట్లు ఈ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఈ మేరకు మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, పుంగనూరు నియోజకవర్గాలను కలిపి జిల్లాగా ప్రకటించారు. దీంతో ప్రస్తుతం రాష్ట్రంలో 26 జిల్లాలు ఉండగా 27వ జిల్లాగా మదనపల్లె ఏర్పాటు కానుంది మదనపల్లె జిల్లాలో మదనపల్లె, పీలేరు రెవెన్యూ డివిజన్లు 19 మండలాలతో ఉండనున్నాయి. ప్రస్తుతం అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో ఉన్న మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం, తంబళ్లపల్లె, ములకలచెరువు, పెద్దమండ్యం, కురబలకోట, పీటీఎం, బి.కొత్తకోట మండలాలకు అదనంగా చిత్తూరు జిల్లా పలమనేరు రెవెన్యూ డివిజన్‌లోని చౌడేపల్లె, పుంగనూరు మండలాలు ఉండనున్నాయి. కొత్తగా ఏర్పడనున్న పీలేరు రెవెన్యూ డివిజన్‌లో చిత్తూరు జిల్లా పలమనేరు రెవెన్యూ డివిజన్‌లోని సదుం, సోమల, అన్నమయ్య జిల్లా రాయచోటి రెవెన్యూ డివిజన్‌లోని పీలేరు, గుర్రంకొండ, కలకడ, కేవీ పల్లె, మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లోని కలికిరి, వాల్మీకిపురం మండలాలు ఉండనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రిలిమినరీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్‌కు సంబంధించి ప్రజల నుంచి అభ్యంతరాలు, సలహాలను ప్రభుత్వం స్వీకరిస్తుంది. ఇందుకుగానూ ఈ నోటిఫికేషన్ వెలువడిన 30 రోజుల పాటు గడువు విధించింది.

అన్నమయ్యలోకి ఒంటిమిట్ట, సిద్దవటం

వైఎస్సార్ కడప జిల్లా, కడప రెవెన్యూ డివిజన్‌లో ఉన్న ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలను అన్నమయ్య జిల్లాలోకి కలుపుతున్నారు. ఈ రెండు మండలాలను రాజంపేట రెవెన్యూ డివిజన్‌లోకి చేర్చుతున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రిలిమినరీ నోటిఫికేషన్ గురువారం సాయంత్రం విడుదల చేసింది. దీనికి సంబంధించి ప్రజల నుంచి అభ్యంతరాలు, సలహాల కోసం 30 రోజులు గడువు విధించింది.

మండల టీడీపీ అధ్యక్షుల ప్రమాణస్వీకారం


ప్రమాణస్వీకారం చేయిస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట నియోజకవర్గంలోని ఆరు మండలాల నూతన టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. ఆరు మండలాల్లో ఇటీవల నూతన మండల పార్టీ అధ్యక్షులను, ప్రధాన కార్యదర్శులను మండల కార్యవర్గ సభ్యులను, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లను నియమించారు. గురువారం రాజంపేట పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో టీడీపీ ఇన్‌చార్జ్ చమర్తి జగన్‌మోహన్‌రాజు రాజంపేట పట్టణ అధ్యక్షుడు దగ్గుపాటి సుబ్రహ్మణ్యంనాయుడు, రూరల్ అధ్యక్షుడు మేడికొండు రవికుమార్‌నాయుడు, నందలూరు అధ్యక్షుడు జంగంశెట్టి సుబ్బయ్య, ఒంటిమిట్ట అధ్యక్షుడు గజ్జల నరసింహా రెడ్డి, సిద్దవటం అధ్యక్షుడు కె.రాజశేఖర్‌యాదవ్, వీరబల్లి అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు, సుండుపల్లె అధ్యక్షుడు చప్పిడి రమేశ్‌నాయుడులతో పాటు కార్యవర్గ సభ్యులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో ప్రమాణస్వీకారం చేయించారు. నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు భీమినేని చిట్టిబాబు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేయడం ఆనందదాయకమన్నారు. పార్టీ నియమావళికి అనుగుణంగా అందరూ పార్టీ ఐక్యతకు కృషి చేసి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయఢంకా మోగించడానికి కృషి చేయాలన్నారు. పార్టీ పరిశీలకుడు చిట్టిబాబు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ బలోపేతానికి నాయకులు పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఆరు మండలాల తెలుగుదేశం పార్టీ నాయకులు, సీనియర్ నేతలు పాల్గొన్నారు.

మదనపల్లెలో అడుగడుగునా సంబరాలు

● మూడు గంటల పాటు ఎమ్మెల్యే ర్యాలీ


బహిరంగ సభలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, నారా లోకేశ్ చిత్రపటాలు చూపుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, నాయకులు

మదనపల్లె టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మదనపల్లెను కొత్త జిల్లాగా ప్రకటించండటంతో స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆధ్వర్యంలో మదనపల్లె జిల్లా సాధన సమితి సభ్యులు, ప్రజలు అడుగడుగునా సంబరాలు నిర్వహించారు. గురువారం సాయంత్రం తిరుపతి నుంచి మదనపల్లెకు వస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు మండలంలోని కాశీరావుపేట వద్ద టీడీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి సీటీఎం, పోతబోలు, దుబ్బిగానిపల్లె, కొత్తవారిపల్లె, ఆరోగ్యవరం, దేవతానగర్, ఎస్టేట్, ఆర్టీసీ బస్టాండు, టౌన్‌బ్యాంకు సర్కిల్ మీదుగా పట్టణంలోని బెంగళూరు బస్టాండు వరకు దాదాపు మూడు గంటల పాటు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా కూటమి ప్రభుత్వం మదనపల్లెను జిల్లా చేయడం శుభపరిణామమన్నారు. అనంతరం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ చిత్రపటాలను ప్రదర్శిస్తూ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో మదనపల్లె జిల్లా సాధన సమితి సభ్యులు పీటీఎం శివప్రసాద్, యమలా సుదర్శనం, శ్రీచందు, పోర్దు లలితమ్మ, టీడీపీ నాయకులు నాదెళ్ల విద్యాసాగర్, నవీన్ చౌదరి, ఆర్‌జే వెంకటేశ్, ఎస్‌ఏ మస్తాన్, రామకృష్ణాచారి, తులసి, ఆర్.ఆంజినేయులు, జనసేన నాయకురాలు దారం అనిత, పెద్ద సంఖ్యలో మహిళలు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు. కాగా స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ వద్ద టీడీపీ ఎన్ఆర్ఐ విభాగం కో-ఆర్డినేటర్ లోకేశ్ కొణెదల సూచలనతో ఎన్ఆర్ఐ విభాగం ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో పెరవలి నవీన్, నిరంజన్‌నాని, వంశీ, జగదీష్, ప్రభాకర్, అయూబ్, రెడ్డిశేఖర్ పాల్గొన్నారు.

జీఎస్టీకి మస్కా

● దుకాణాల్లో కానరాని తగ్గింపు ధరలు
● పాత ధరలకే అమ్మకాలు
● ఆకస్మిక తనిఖీలు, విజిలెన్స్ దాడులు శూన్యం
● పేదలకందని జీఎస్టీ తగ్గింపు ఫలాలు


జిల్లా జీఎస్టీ కార్యాలయం

కడప కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యాపార సముదాయాలు, పరిశ్రమలు, వస్తు ఉత్పత్తుల నుంచి స్టేట్, సెంట్రల్ ప్రభుత్వాలకు పన్నుల రూపంలో ఏటా దాదాపు రూ.2 వేల కోట్ల వరకు చెల్లింపులు జరుగుతున్నాయి. అందులో సగం గూడ్స్ సర్వీసు టాక్సుల (జీఎస్టీ) కింద రాష్ట్ర ప్రభుత్వానికి జిల్లా నుంచి 2024- 25 ఆర్థిక సంవత్సరంలో రూ.909.12 కోట్లు పన్నుల రూపంలో చేరాయి. గతేడాది రాబడిని పరిగణనలోకి తీసుకుని ఈ ఏడాది మరో 30 శాతం పెంపుతో 2025-26 జీఎస్టీ టార్గెట్ రూ.1108.42 కోట్లు విధించారు. ఈ టార్గెట్‌కు సంబంధించి అక్టోబరు నాటికే 50 శాతం వరకు అధికారులు వసూళ్లు చేశారు. అయితే స్టేట్, సెంట్రల్ టాక్సుల వసూళ్లపై ఉన్న శ్రద్ధ ప్రజలకు మేలు చేసే జీఎస్టీ తగ్గింపు విషయంలో అధికారులు తీసుకుంటున్న చర్యలు శూన్యమనే విమర్శలున్నాయి. రెండు నెలలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌ను పాటించక రిటైల్ మార్కెట్ వ్యాపారులు పాత ధరలతో ప్రజలను మస్కా కొడుతున్నారు. దీంతో పేద, మధ్య తరగతి వర్గాలతో పాటు ప్రతి కుటుంబానికి తగ్గిన జీఎస్టీ ఫలాలు ఆశించిన స్థాయిలో దక్కడం లేదనే విమర్శలున్నాయి.

ధరల తగ్గింపు బోర్డులేవీ?

జీఎస్టీ ధరల తగ్గింపులకు సంబంధించిన బోర్డులు ఏ వ్యాపార సముదాయాల వద్ద ప్రదర్శించడం లేదు. పాత స్టాక్ అంటూ వ్యాపారులు పన్నుల మినహాయింపుపై బుకాయింపులకు దిగుతున్నారు. దీంతో ప్రజలకు చేరాల్సిన జీఎస్టీ ఫలాలు రిటైలర్ల జేబుల్లోకి చేరుతున్నాయి. ప్రజల ఆరోగ్యానికి సంబంధించి వాడే వాటిపై మొన్నటి వరకు 5, 12, 18 శాతాలున్న జీఎస్టీని అవసరాన్ని బట్టి 0 శాతం వరకు తగ్గించారు. మెడికల్ స్టోర్లలో కానీ, నిత్యావసర వస్తువుల అమ్మకాల దుకాణాలలో కానీ జీఎస్టీ మిగులు ప్రజలకు అందడం లేదు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేల కోట్ల రూపాయల ఆర్థిక భారాన్ని భరించాల్సిందే తప్ప.. ప్రజలకు జీఎస్టీ ఫలాలు అందే అవకాశం లేదు. దీనిపై నిఘా పెట్టి ప్రజలకు ఆదా చేకూర్చే విషయంలో సంబంధిత అధికారులు మీనవేషాలు లెక్కిస్తుండం ప్రశ్నార్థకంగా మారింది.

దిగొచ్చిన జీఎస్టీపై కొరవడిన నిఘా

2017లో జీఎస్టీ సంస్కరణలు దేశవ్యాప్తంగా అమలు చేశారు. నాలుగు శ్లాబుల్లో 5, 12, 18, 40 శాతం పన్నులతో ప్రజలు, వ్యాపార రంగాలపై భారం మోపారు. దాదాపు 9 ఏళ్ల పాటు జీఎస్టీ భారం తప్పలేదు. అన్ని వర్గాల్లో పన్నుల భారం చర్చనీయాంశం అయింది. దీంతో దిగొచ్చిన కేంద్రం ఈ ఏడాది సెప్టెంబరు నుంచి ప్రజలకు మేలు చేసే చర్యల్లో భాగంగా ఒక్కసారిగా సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ 2.0 సంస్కరణలు తెచ్చింది. ఊహించని విధంగా 438 రకాల వస్తు ఉత్పత్తులు, ఆహార వస్తువుల మొదలు విద్య, వైద్యం, ఎలక్ట్రానిక్, పరిశ్రమలు లాంటి అన్ని రంగాలలో పన్నుల భారాన్ని భారీగా తగ్గించారు. 3 శ్లాబుల్లో 5, 12, 18 శాతాలకు కుదించడంతో మన రాష్ట్రంలో రూ.8 వేల కోట్ల ఆర్థిక భారాన్ని కూటమి సర్కారు భరిస్తోంది. ఈ లెక్కన జిల్లా ప్రజలకు జీఎస్టీ దాదాపు రూ.300 కోట్ల మేర తగ్గనున్నట్లు అధికారులు లెక్కలు కడుతున్నారు. అయితే ఇప్పటికీ పాత ధరలతో పన్నుల మినహాయింపులు లేకుండా రిటైల్ వ్యాపారులు దోచుకుంటున్నారు. వీరిపై జిల్లాలో ఎక్కడా జీఎస్టీ అధికారులు, విజిలెన్స్ దాడులు లేవు.

ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవు

జిల్లా వ్యాప్తంగా జీఎస్టీ పన్నుల భారం తగ్గింపుపై విస్తృత ప్రచారం చేశాము. నెలరోజుల పాటు కలెక్టర్ నుంచి అన్ని శాఖల అధికారులు తమ పరిధిలో జీఎస్టీ ఫలాలపై మండల, సచివాలయాల స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాం. కడప డివిజన్ పరిధిలో 7 సర్కిళ్ల ఆఫీసుల పరిధిలో పన్నుల వసూళ్లతో పాటు జీఎస్టీ అమలుపై ఆరాతీస్తున్నాం. అధిక ధరలకు అమ్ముతున్నట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే రిటైల్ వ్యాపార సముదాయాలపై దాడులు చేసి చర్యలు తీసుకుంటాము.

- సుమతి, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్

కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యం

ఏఐసీసీ అబ్జర్వర్ మహేంద్రన్



సమావేశంలో మాట్లాడుతున్న మహేంద్రన్

రాయచోటిటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడమే తమ ప్రధాన లక్ష్యమని ఏఐసీసీ అబ్జర్వర్ కె.మహేంద్రన్ తెలిపారు. గురువారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సంఘటన్ సృజన్ అభియాన్ (సంస్థాగత నిర్మాణ కార్యక్రమం) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థాగత నిర్మాణంలో భాగంగా అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి ఆసక్తి కలిగిన నాయకుల నుంచి దరఖాస్తులను స్వీకరించినట్లు తెలిపారు. నియోజకవర్గాల వారీగా సమీక్షలు నిర్వహిస్తూ పార్టీ అభివృద్ధికి పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగా జిల్లా పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రత్యేక సమీక్షా సమావేశాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. అనంతరం ఏపీసీసీ అబ్జర్వర్ అశోక్‌రత్నం, అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజుల భాస్కర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పీసీసీ ప్రతినిధి ఎస్ఎండీ గౌస్, జిల్లాలోని అన్ని నియోజకవర్గాల కో-ఆర్డినేటర్లు, జిల్లా కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ ప్రతినిధులు, సేవాదళ్ సభ్యులు, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా కిరణ్‌కుమార్


ఓసూరి కిరణ్‌కుమార్

మదనపల్లె అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా మదనపల్లె మండలం సీటీఎంకు చెందిన ఓసూరి కిరణ్‌కుమార్‌ను నియమించినట్లు ఆ పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సి.కుమార్‌స్వామి, మేమిరెడ్డి సురేంద్రనాథరెడ్డిలు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అభివృద్ధి కోసం వ్యవసాయ పురోభివృద్ధికి తోడ్పాటు ఇస్తూ రైతులకు శిక్షణ, మార్కెట్ ఎగుమతి అవకాశాలు, ఆధునిక సాంకేతిక వ్యవసాయం, సహకార వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

ఆయుష్ ఆసుపత్రి నిర్మాణ స్థలం పరిశీలన


డాక్యుమెంట్స్‌ను పరిశీలిస్తున్న జేసీ

రాయచోటి (నేతాజీసర్కిల్), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆయుష్ ఆసుపత్రి నిర్మించేందుకు ఎంపిక చేసిన స్థలాన్ని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ స్థలానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. సర్వే అధికారులు, రెవెన్యూ సిబ్బంది సంబంధిత వివరాలను ఆయనకు వివరించారు.



విద్యార్థులతో ప్రాజెక్టులు చేయించాలి



మాట్లాడుతున్న యూనిసెఫ్ ప్రతినిధి సుదర్శన్

రాయచోటిటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అటల్ టింకరింగ్ ప్రయోగశాలలో అటల్ క్యాలెండర్‌ను అనుసరించి క్రమం తప్పకుండా విద్యార్థులతో ప్రాజెక్టులు చేయించాలని యునిసెఫ్ ప్రతినిధి సుదర్శన్ సూచించారు. స్థానిక మాసాపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అటల్ టింకరింగ్ పాఠశాల వర్క్‌షాప్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఉపాధ్యాయులు రూపొందిస్తున్న ప్రాజెక్టులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ అటల్ టింకరింగ్ ప్రయోగశాలలో అటల్ క్యాలెండర్‌ను అనుసరించి క్రమం తప్పకుండా విద్యార్థులతో ప్రాజెక్టులు చేయించాలని సూచించారు. అటల్ ప్రయోగశాలలో కార్యక్రమాలను సక్రమంగా నిర్వహిస్తే విద్యార్థులు శాస్త్రవేత్తలుగా, వ్యవస్థాపకులుగానూ రూపొందుతారన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అసిస్టెంట్ ఏఎంవో అసదుల్లా, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, రీసోర్స్ పర్సన్స్ ఆంజనేయులు, వేణుగోపాల్‌రెడ్డి, మహబూబ్‌బాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హరినామ సంకీర్తనలతో పులకించిన సంబేపల్లె



రథంపై స్వామి ఊరేగింపు, పాదయాత్రలో హరేకృష్ణ- హరేరామ భక్తులు

రాయచోటి (నేతాజీ సర్కిల్), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ కృష్ణచైతన్య సంఘం (ఇస్కాన్) నిర్వహిస్తున్న 7వ పాదయాత్ర బృందం గురువారం సంబేపల్లెకు చేరుకుంది. కృష్ణ- బలరాములు, భక్తివేదాంత స్వామి ప్రభుపాద విగ్రహాలు కలిగిన రథం, దానికి కట్టిన ఎద్దులు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఇస్కాన్ ప్రచారకులు మాట్లాడుతూ రోజుకు ఒక్కసారైనా హరేకృష్ణ-హరేరామ మహామంత్రాన్ని జపిస్తే మనసుకు శాంతి, జీవనానికి శోభ, ఆత్మకు ముక్తి లభిస్తుందన్నారు. 1984లో ప్రారంభమైన ఈ పాదయాత్ర ఇప్పటి వరకు ఆరుసార్లు విజయవంతంగా పూర్తి చేసుకుని ప్రస్తుతం 7వ పర్యాయం నడుస్తోందని తెలిపారు

ఏళ్ల తరబడి అద్దె భవనాల్లోనే...!

- శాశ్వత భవనాల గురించి పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు, ప్రజలు
- ఇదీ రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్, తపాలా కార్యాలయాల తీరు

సుండుపల్లె, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రజలతో సంబంధం ఉండే రెవెన్యూ, సబ్‌రిజిస్ట్రార్, తపాలా కార్యాలయాలు ఏళ్ల తరబడి అరకొర వసతులతో అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. చిన్నపాటి భవనాల్లో కార్యాలయాలు ఉండటంతో ఉద్యోగులతో పాటు పని నిమిత్తం వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కార్యాలయాలకు సొంత భవనాల నిర్మాణంపై అధికారులు దృష్టి సారించడం లేదు. అలాగని స్థలాల సమస్యా అంటే అదీ లేదు. సుండుపల్లె మండల కేంద్రంలో లక్షల విలువ చేసే ప్రభుత్వ స్థలాలు మాయమైపోతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో విలువైన ప్రభుత్వ స్థలాలను కొంతమంది వైసీపీ నాయకులు ఆక్రమించి అమ్మకాలు నిర్వహించారు. అక్రమ నిర్మాణాలు చేపట్టారు. కూటమి ప్రభుత్వంలోనైనా సొంత భవన నిర్మాణాలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

దశాబ్దాలుగా అద్దె భవనాలే...

సుండుపల్లె మండల కేంద్రంలో దశాబ్దాలుగా అద్దె భవనంలోనే తహసీల్దార్ కార్యాలయం నిర్వహిస్తున్నారు. సుండుపల్లె అత్యంత మారుమూల మండలం. సుమారు 90 వేల పైచిలుకు జనాభా కలిగి మండలంలో శాశ్వత తహసీల్దార్ కార్యాలయం నిర్మించకపోవడంతో అద్దె భవనాల్లో సేవలు అందిస్తున్నారు. 15 గ్రామ పంచాయతీల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు పలు రకాల అవసరాల నిమిత్తం తహసీల్దార్ కార్యాలయానికి వస్తారు. సరైన భవన సదుపాయం లేకపోవడంతో రైతులు రెవెన్యూ సేవలకు దూరమవుతున్నారు. అధికారులు అందరూ కూర్చుని సేవలు అందించే పరిస్థితి లేదు. అద్దె భవనానికి నెలకు రూ.10 వేలు చెల్లిస్తున్నారు. మండల వ్యవస్థ ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటి వరకు అద్దె భవనాల్లో ఉంటూ సేవలు అందిస్తున్నా శాశ్వత నిర్మాణాలకు ఎటువంటి పురోగతి లేదు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కూడా అద్దె భవనంలో కొనసాగుతోంది. సుండుపల్లె మండల కేంద్రంలో 1995 సంవత్సరం నుంచి సబ్ రిజిస్ట్రార్ సేవలు ప్రజలకు అందిస్తున్నా ఇప్పటి వరకు శాశ్వత భవనం లేదు. సుమారు 30 సంవత్సరాల నుంచి లక్షల రూపాయలు అద్దె భవనాలకు ప్రభుత్వం నగదు చెల్లిస్తోంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనంకు అద్దె నెలకు రూ.10,619 చెల్లిస్తున్నారు. ఇదంతా ప్రభుత్వానికి పెనుభారంగా మారుతోంది.

సమస్యపై అధికారుల దృష్టికి



సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్తాము. ప్రస్తుతం అద్దె భవనంలో ఉన్నాము. ప్రతి నెలా ప్రభుత్వం అద్దె చెల్లిస్తోంది. శాశ్వత భవనం ఏర్పాటైతే రైతులకు, ప్రజలకు ఎంతో మేలుగా ఉంటుంది. మారుమూల మండలం పెద్ద మండలం కావడంతో పెద్ద సంఖ్యలో పలు సమస్యలపై ప్రజలు, రైతుల వస్తూ ఉంటారు. గతంలో దాతలు తహసీల్దార్ కార్యాలయం కోసం ఇచ్చిన స్థలంలో నిర్మించకూడదని కోర్టుకు వెళ్లారు. ప్రభుత్వ స్థలం చూసి ప్రతిపాదనలు పంపిస్తాము.

-మహబూబ్‌చాంద్, తహసీల్దార్, సుండుపల్లె

చిరునామాలు మారుస్తున్నారే గానీ...

సుండుపల్లెలో రెవెన్యూ కార్యాలయం ఒకచోట నుంచి మరొక అద్దె భవనంలోకి మారుస్తున్నారే కానీ ఇప్పటి వరకు సొంత భవన నిర్మాణం ఊసెత్తడం లేదు. తహసీల్దార్, సబ్‌రిజిస్ట్రార్ ఇంత ప్రధానమైన కార్యాలయాలు ఇరుకు గదుల అద్దె భవనంలో నిర్వహిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి అధికంగా ●ప్రప రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకే ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో రద్దీ అధికంగా ఉంటోంది. అయినా అధికారులు సొంత భవన నిర్మాణంపై దృష్టి పెట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.





అద్దె భవనాల్లో ఉన్న తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

ఏడాదిన్నరకు ఎంపీ రాక..!

- వినతుల పేరిట పరామర్శలు
- ఎంపీని కలిసేందుకు వచ్చిన ప్రజలు బేజారు


ఎంపీడీవో కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్నఎంపీ మిథున్‌రెడ్డి

మదనపల్లె, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి.. ఏడాదిన్నర తర్వాత గురువారం మదనపల్లెకు విచ్చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను కలసిన పార్టీ శ్రేణులను పలకరిస్తూ, అన్నా..బాగున్నావా? పిల్లలు బాగున్నారా? ఏం చేస్తున్నారంటూ అడిగి తెలుసుకున్నారు. కాగా.. ఎంపీటీసీలు, అధికారులతో ఎంపీ సమీక్షిస్తారని, ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని వైసీపీ వారు ప్రచారం చేశారు. వైసీపీ నేతలే కాదు..అటు అధికారులు కూడా ఇదే ప్రచారం చేశారు.

దీంతో మదనపల్లె మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు నియోజకవర్గాల నుంచి కార్యకర్తలు హాజరయ్యారు. అలాగే అన్నిశాఖల అధికారులు కూడా హాజరయ్యారు. కానీ అక్కడ సమీక్ష లేదు. సమావేశం అంతకంటే లేదు. వచ్చినోళ్లంతా వచ్చినట్లు ఎంపీని వరుసగా వెళ్లి కలుస్తూ సన్మానించడం, సెల్ఫీలు, ఫొటోలకు పోటీపడ్డారు. దీంతో ఎంపీని కలిసేందుకు వచ్చిన ప్రజలు బేజారు పడ్డారు. ఎంపీ రాక సందర్భంగా వైసీపీ వారు ర్యాలీ చేయడంతో సీటీఎం రోడ్డు, చిత్తూరు బస్టాండు సర్కిల్‌లో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయి అరగంటకుపైగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎంపీకి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి, వైసీపీ స్థానిక ఇన్‌చార్జి ఎస్.నిసార్‌అహ్మద్, ఆ పార్టీ యువనాయకుడు హర్షవర్ధర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీసభ్యుడు తట్టి శ్రీనివాసులురెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజ వేర్వేరుగా స్వాగతం పలికారు.

కాగా.. మదనపల్లెను జిల్లా చేయలేని ఎంపీ.. మదనపల్లె పర్యటనకు ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారని, ఎంపీ పర్యటనను అడ్డుకుంటామని తెలుగుయువత అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు బుధవారం ప్రకటించారు. ఈ నేపథ్యంలో గురువారం ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా స్థానిక వన్‌టౌన్, టూటౌన్ పోలీసులు నీరుగట్టువారి పల్లెలోని తెలుగుయువత అధ్యక్షుని నివాసానికి వెళ్లి ఆరా తీశారు. ఎంపీ పర్యటనను అడ్డుకుంటున్నారా? ఎక్కడైనా పార్టీశ్రేణులు ఆందోళనకు దిగే అవకాశం ఉందా? అంటూ ఆయన నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అక్రమాలపై విచారణకు

చిత్తూరు జిల్లా రిజిస్ట్రార్ నియామకం

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలోని బి.కొత్తకోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి అక్రమాలపై విచారణకు అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా వ్యవహరిస్తున్న చిత్తూరు జిల్లా రిజిస్ట్రార్ ఎ.వెంకటరమణమూర్తిని రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ రామలక్ష్మీ పట్నాయక్ నియమించారు. ప్రభుత్వానికి అందిన ఫిర్యాదులపై కడప జిల్లా డీఐజీ రామలక్ష్మీ పట్నాయక్ ఈనెల 25న బి.కొత్తకోటకు చేరుకుని విచారణ జరిపారు. అక్కడి అక్రమాలపై పలువురు కక్షిదారులు సీఎం కార్యాలయానికి ఫిర్యాదు చేయడంతో ఇక్కడి అక్రమాల డొంక కదిలింది. పలువురు కక్షిదారులు సబ్ రిజిస్ట్రార్ అవినీతిపై పిటిషన్ల రూపంలో అక్రమాలను వివరించారు. ఆస్తులు, క్రయ, విక్రయదారులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే మార్కెట్ విలువలో ఒక శాతం లంచం రూపంలో ఇవ్వాల్సిందేనని, ఇవ్వకుంటే వివిధ రకాలుగా కొర్రీలు పెడుతూ రిజిస్ట్రేషన్ చేయకుండా వాయిదాలు వేశారని ఆరోపించారు. స్టాంపులను వెండర్లు అధిక ధరకు అమ్ముతున్నారని, ఈసీ నకళ్లు జారీ చేయడానికి అధిక లంచం అడుగుతున్నారని ఆరోపించారు. దీంతో చిత్తూరు జిల్లా రిజిస్ట్రార్ ఏఎస్ఆర్ మూర్తిని పిటిషనర్లకు నోటీసులు ఇచ్చి విచారణ చేసి నిజానిజాలు తేల్చాలని డీఐజీ రామలక్ష్మీ పట్నాయక్ ఆదేశించారు. కార్యాలయంలో సీసీటీవీ పుటేజీలను, ఫైళ్లను పరిశీలించి నివేదికను ఇవ్వాలని పేర్కొన్నారు.

'మీ డబ్బు మీ హక్కు' పోస్టర్ ఆవిష్కరణ

రాయచోటి(నేతాజీ సర్కిల్), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సేవల విభాగం సూచనల మేరకు మీ డబ్బు-మీ హక్కు కార్యక్రమం పోస్టర్‌ను జిల్లా ఎల్డీయం ఆంజనేయులు ఏపీజీబీ రాయచోటి కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ బ్యాంకుల్లో గత 10 సంవత్సరాల వరకు లావాదేవీలు జరపకుండా ఉన్న ఖాతాలు పునరుద్ధరించుకోవాల్సిందిగా ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో శాఖ నిర్వాహక అధికారి సదాశివరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మదనపల్లె అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర 8వ స్కై చాంపియన్ షిప్ 2025ను ఈనెల 23న స్కై మార్షల్ ఆర్ట్స్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లాలోని నంద్యాల పట్టణం, ఎన్టీఆర్ షాదీఖానాలో రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహించారు. ఇందులో మదనపల్లె విద్యార్థులు విశేష ప్రతిభ కనబర్చి అనేక మెడల్స్ సాధించారని ఏపీ స్కై కోచ్ ఎస్ ఖాదర్‌బాషా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 29 బంగారు పతకాలు సాధించడం పట్ల ఏపీ స్కై మార్షల్ ఆర్ట్స్ చైర్మన్ ఇస్మాయిల్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఇందులో 11 ఏళ్ల వయస్సు విభాగంలో నితీష్, కుషాల్ సాయి, సాత్విక, తహాఅర్షా, సాయి ప్రితికలు, 14 ఏళ్ల విభాగంలో శైలజ, హర్షిత యశశ్విని, గణేష్, రెడ్డికావ్య, 18 ఏళ్ల విభాగంలో అయాన్, చరిత సాయి, లిఖిత్, గాయత్రి, సీనియర్ విభాగంలో ముహిజుద్దీన్ జుబేదర్, ముజహర్ అలి (ఓపెన్ కేటగిరి) ప్రతిభ చూపారు. గెలుపొందిన విద్యార్థులు జనవరి 5, 6, 7 తేదీల్లో హైదరాబాదులోని గచ్చిబౌలి స్టేడియంలో పాల్గొంటారని అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు నరసింహులు తెలిపారు.

విద్యార్థిని అభినందించిన కలెక్టర్


విద్యార్థిని అభినందిస్తున్న కలెక్టర్

గుర్రంకొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాక్ అసెంబ్లీ కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థి సుఫియాన్‌ను కలెక్టర్ నిశాంత్‌కుమార్ బుధవారం రాత్రి అభినందించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన పోటీ పరీక్షల్లో గుర్రంకొండ మండలం తరిగొండ జడ్పీ హైస్కూల్ పదవ తరగతి విద్యార్థి సుఫియాన్ ఉత్తమ ప్రతిభ చూపి ప్రథమ స్థానంలో నిలిచాడు. విద్యార్థిలోని ప్రతిభను గుర్తించిన కలెక్టర్ అభినందించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. పది పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని విద్యార్థికి సూచించారు. కార్యక్రమంలో డీఈవో సుబ్రమణ్యం, హెచ్ఎం రామచంద్ర, ఉపాధ్యాయులు కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

గుంజనేరులో వ్యక్తి మృతి

పెనగలూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గుంజనేరులో పడి ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఏఎస్ఐ రాముడు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... మండలంలోని కొండూరు పంచాయతీ తిరణంపల్లెకు చెందిన నన్నూరి రాజేశ్ (34) సిరిచాపల వ్యాపారం చేస్తుంటాడు. నాలుగు రోజులుగా అతను ఇంటికి రాలేదు. అతడి భార్య విజయ కుటుంబ సభ్యులు అతనికి ఫోన్ చేసినా స్పందించకపోవడంతో, వ్యాపారం పనిపై ఇతర ప్రాంతాలకు వెళ్లి ఉంటాడని భావించారు. ఈ నేపథ్యంలో గురువారం ఎ-రాచపల్లె సమీపంలో గుంజనేరులోని ముళ్ల పొదలకు తగులుకున్న మృతదేహాన్ని గుర్తించి స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహం తలకు చుట్టుకుని ఉన్న లుంగీ, టవల్‌ను పరిశీలించగా అందులో సెల్‌ఫోన్ లభించింది. దాని ఆధారంగా మృతుడు తిరణంపల్లెకు చెందిన రాజేశ్‌గా గుర్తించారు. మద్యం మత్తులో ప్రవాహంలోకి దిగడంతోనే అతను మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కుటుంబ సభ్యుల సమక్షంలో మృతదేహాన్ని రాజంపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఏఎస్ఐ తెలిపారు.

గుళికల మందు తిని బాలిక మృతి

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పెళ్లికి తీసుకెళ్లలేదని ఓ బాలిక గుళికల మందు తిని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు జె.వడ్డెపల్లెకు చెందిన లక్ష్మీ ప్రసన్న (15) బి.యర్రగుడి గ్రామంలో జరుగుతున్న తమ బంధువుల పెళ్లికి తానూ వస్తానని తల్లిని కోరింది. అందుకు ఆమె నిరాకరించడంతో మనస్తాపానికి గురై గుళికల మందు తినింది. విషయం గమనించి తల్లి ఆమెను రాయచోటి ప్రైవేటు ఆసుపత్రికి తరలించింది. పరిస్థితి విషమించడంతో తిరుపతికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందింది కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీంద్రబాబు తెలిపారు.

ఝార్ఖండ్ యువకుడు ఆత్మహత్య



మదనపల్లె అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన యువకుడు ఉరేసుకుని మృతిచెందిన సంఘటన మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. తాలుకా సీఐ కళావెంకటరమణ వివరాల మేరకు... ఝార్ఖండ్ రాష్ట్రం, హంసేన్‌బాద్ జిల్లా, జామియా గ్రామానికి చెందిన రాంప్రీత్ వార్ కుమారుడు మోతిరావ్ వార్ (23) రాజంపేటకు చెందిన సెంట్రింగ్ మేస్త్రీ శ్రీనివాసులు వద్ద పనిచేస్తున్నాడు. పోతబోలు వద్ద ఓ ఇంటిపని చేస్తూ అక్కడే ఉంటున్నాడు. ఏమైందో కానీ గురువారం పోతబోలు కురవపల్లె సమీపంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పరిశీలించిన అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు సీఐ కళా వెంకటరమణ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

రామాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కువైత్‌కు వెళ్లిన భర్త తిరిగి రాలేదని మనస్థాపానికి గురై ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ వెంకట సుధాకర్‌రెడ్డి కథనం మేరకు... పుల్లంపేట మండలం కేతరాజుగారిపల్లెకు చెందిన లక్ష్మిదేవికి (36) అదే గ్రామానికి చెందిన వెంకటేశ్‌తో 2008లో వివాహమైంది. వారికి ఇంటర్మీడియట్ చదివే కూతురు, పదో తరగతి చదివే కుమారుడు ఉన్నారు. 2014లో ఈమె ఉపాధి నిమిత్తం కువైత్‌కు వెళ్లింది. అక్కడ రామాపురం మండలం గాండ్లపల్లెకు చెందిన సురేంద్రను రెండో వివాహం చేసుకుంది. ఇటీవల ఆమె ఒంటరిగానే తిరిగి వచ్చి రెండో భర్త ఇంట్లోనే నివసిస్తోంది. నాలుగు నెలలైనా భర్త ఇండియాకు తిరిగిరాకపోవడంతో మనస్తాపానికి గురై గురువారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న వీఆర్వో పుష్పరాజ్ రామాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వినీత్ మృతి కేసులో ముగ్గురికి బెయిలు మంజూరు

కలికిరి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వినీత్‌కుమార్‌రాజు మృతి కేసులో అరెస్ట్ అయిన నలుగురు నిందితులను కలికిరి పోలీసులు గురువారం వాయల్పాడు కోర్టులో హాజరుపరిచారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయాధికారి నిందితుల్లో ముగ్గురికి బెయిల్ మంజూరు చేశారు. నలుగురు నిందితుల్లో అబూబెకర్, పాలగిరి అహ్మద్, మందా నరేష్‌లను బెయిలుపై విడుదల చేశారు. వినీత్‌ను కారుతో ఢీకొట్టి అతడి మృతికి కారణమైన మరో నిందితుడు నౌషద్ బాషా (బబ్లూ)కు మాత్రం న్యాయాధికారి రిమాండు విధించారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులకు భూమి పూజ

- కడప-రేణిగుంట రహదారి పనులు ప్రారంభం
- 122 కిలోమీటర్లు.. రూ.3232 కోట్లు

రాజంపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సుమారు మూడేళ్లుగా తీవ్ర జాప్యానికి గురవుతున్న కడప-రేణిగుంట 716 గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులకు భూమి పూజ చేశారు. ఈ పనులను దక్కించుకున్న కాంట్రాక్టు ప్రతినిధులు బుధవారం రాజంపేట మండలం కూచివారిపల్లె వద్ద ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులకు భూమిపూజ చేసి పనులకు శ్రీకారం చుట్టారు. రెండేళ్లలో ఈ పనులు పూర్తి చేయడానికి సంబంధిత కాంట్రాక్టర్లు సిద్ధమయ్యారు. ప్రస్తుతం కడప-రేణిగుంట మధ్య రెండు లేన్ల రహదారి పూర్తిగా పాడై ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఈ సమయంలో మూడేళ్లుగా ఊరిస్తున్న నాలుగు లేన్ల రహదారికి భూమి పూజ జరగడంతో రెండేళ్లలో ఈ పనులు పూర్తయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

రోడ్డు పనులు ఇలా...

భాకరాపేట నుంచి కడప వరకు ఇప్పుడున్న రోడ్డునే నాలుగు లేన్లుగా వేస్తారు. భాకరాపేట నుంచి రైల్వేకోడూరు వరకు ప్రస్తుతం ఉన్న రోడ్డు కాకుండా రైల్వేలైను అవతల అటవీ మార్గం ద్వారా సుమారు 82 కిలోమీటర్ల మేర కొత్త గ్రీన్‌ఫీల్డ్ హైవే రహదారిని ఏర్పాటు చేస్తారు. అదే రైల్వే లైనుకు అవతల పల్లె మార్గాలకు దూరంలో అనగా జనావాసాలకు దూరంగా 82 కిలోమీటర్ల మేర ఇప్పుడున్న రెండు లైన్లు కాకుండా నాలుగు లేన్ల రోడ్డును భాకరాపేట నుంచి కోడూరుకు వేయడం వల్ల ప్రయాణం బాగా సాగుతుంది. అలాగే శెట్టిగుంట నుంచి రేణిగుంట వరకు ప్రస్తుతమున్న రెండు లేన్ల రహదారిని నాలుగు లేన్లుగా ఏర్పాటు చేస్తారు. అయితే ప్రస్తుతమున్న రోడ్డునే నాలుగు లేన్లుగా మారుస్తారు. మొత్తంగా 122 కిలోమీటర్లు ఉన్న ఈ రహదారిలో కడప నుంచి చిన్నఓరంపాడు వరకు 64 కిలోమీటర్ల రోడ్డును, చిన్నఓరంపాడు నుంచి రేణిగుంట వరకు 54 కిలోమీటర్ల మరో రోడ్డును రెండు ప్యాకేజీలుగా ఏర్పాటు చేయనున్నారు. ఈ రెండు ప్యాకేజీల రోడ్డు పనులను గతంలో టెండరు వేసే సమయంలో రూ.3232 కోట్లతో ఈ రోడ్డును లక్ష్మీ ఇన్‌ఫ్రా అనే సంస్థ దక్కించుకుంది. ఈ రోడ్డుకు కేంద్ర వన్యప్రాణుల సంరక్షణ విభాగం అనుమతి ఇచ్చినందున త్వరలో పనులు ప్రారంభించేందుకు జాతీయ రహదారుల సాధికార సంస్థ వెంటనే పనులు ప్రారంభానికి శ్రీకారం చుట్టింది. రోడ్డు అంతా ఒకటిన్నర మీటరు ఎత్తులో నిర్మించనున్నారు. ఈ సందర్భంగా హైవేలో 55 కిలోమీటర్ల మేర 11 చోట్ల భారీ వంతెనలు నిర్మించనున్నారు. ఆయా ప్రాంతాల్లో మండలాలు, ప్రధాన గ్రామాలకు అనుసంధానంగా అప్రోచ్ రోడ్డును కూడా ఏర్పాటు చేయనున్నారు. రోడ్డు కిందనే బ్రిడ్జిలు, కాలువలు ఏర్పాటు చేస్తారు. బాలుపల్లె అటవీ మార్గంలో శెట్టిగుంట నుంచి బాలుపల్లె ప్రాంతంలో వన్యప్రాణులు అటు ఇటు తిరగడానికి రోడ్డు కింద కాలువల రూపేణా మార్గాలు ఏర్పాటు చేస్తారు.


రాజంపేట మండలం కూచివారిపల్లె వద్ద గ్రీన్‌ఫీల్డ్ హైవేకి భూమి పూజ చేస్తున్న కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు

బంగారు దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



బంగారు నగల దుకాణాన్ని పరిశీలిస్తున్న విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు

పోరుమామిళ్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్లలోని బంగారు దుకాణాలలో గురువారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు తనిఖీలు చేశారు. మహాత్మాగాంధీ విగ్రహం సర్కిల్‌లో ఉన్న బంగారు దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను, సంబంధిత డాక్యుమెంట్లను పరిశీలించారు. ఒక దుకాణంలో తూకాల్లో తేడాలు రావడంతో రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఈదుళ్లపల్లె సమీపంలో ఉన్న రైస్‌మిల్లును తనిఖీ చేశారు. కడప డీసీటీవో గీతావాణి, బాబు, ఎన్ ఫోర్స్‌మెంటు అధికారులు గౌస్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ... వ్యక్తి మృతి



మైదుకూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని వనిపెంట రోడ్డులో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఇందిరమ్మ కాలనీకి చెందిన మునగల వెంకటరమణ (65) సైకిల్‌పై వెలుతుండగా వెంకటేశ్వరా లారీ కాటా వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందాడు. మైదుకూరు పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

రైలు ఢీకొని 28 గొర్రెలు మృతి



సీకేదిన్నె, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రైల్వేక్రిష్ణాపురం వద్ద ప్రమాదవశాత్తు రైలు ఢీకొని గాలిబోయిన సురేంద్రకు చెందిన 28 గొర్రెలు మృతిచెందాయి. గురువారం కడప-కమలాపురం రైల్వే మార్గంలో రైలు వస్తున్న సమయంలో గొర్రెల వైపు కుక్క పరుగెత్తడంతో బెదిరిపోయి ఒక్కసారిగా రైల్వేట్రాక్‌పైకి పరుగెత్తాయి. ఈ ప్రమాదంలో 28 గొర్రెలు మృతి చెందాయి. దాదాపు రూ.4 లక్షలకుపైగా నష్టం వాటిల్లిందని గొర్రెలకాపరి ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

కుక్కల దాడిలో ఆరు గొర్రెలు...



చక్రాయపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.ఎర్రగుడి గ్రామం బీఎన్ తాండాలో కుక్కలు దాడి చేయడంతో ఆరు గొర్రెలు మృతి చెందాయి. గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో గంగేనాయక్‌కు చెందిన గొర్రెల మందపై ఊర కుక్కలు దాడి చేశాయి. గమనించిన అతని కుమారుడు కుక్కలను తరిమేశాడు. అయితే అప్పటికే ఆరు గొర్రెలను చంపేశాయి. గొర్రెల విలువ దాదాపు లక్ష రూపాయలు ఉంటుందని బాధితుడు తెలిపారు. గ్రామంలో దాదాపు 50 కుక్కలు ఉన్నాయని.. వాటి బారి నుంచి రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

మహిళ మెడలోని బంగారు గొలుసు చోరీ

పులివెందుల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భార్య భర్తలు కలసి వాకిం గ్ చేస్తుండగా మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి లాక్కెళ్లాడు. వివరాలిలా... పులివెందులకు చెందిన వంకదార సుబ్బారావు తన భార్యతో కలసి పాత జూనియర్ కళాశాల సమీపంలో గురువారం ఉదయం వాకింగ్ చేస్తున్నారు. అదే సమయంలో గుర్తు తెలియని ఓ వ్యక్తి అటువైపు వచ్చి ఉన్నట్లుండి సుబ్బారావు భార్య మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కొని పారిపోయాడు. బంగారు గొలుసు లాగే సమయంలో ఆ మహిళ గట్టిగా పట్టుకోవడంతో కొంత మేర తెగిపోయింది. కొంత దొంగ ఎత్తుకుపోగా మిగిలిన గొలుసు ఆమె చేతికి వచ్చింది. తులం మూడు గ్రాముల బంగారు గొలుసును దొంగ ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు.

లారీని ఢీకొన్న మరో లారీ

ముద్దనూరు నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి కడప-తాడిపత్రి జాతీయ రహదారిలోని చింతకుంట సమీపంలో గురువారం ఉదయం నిలబడి ఉన్న లారీని వెనుక వైపు మరో లారీ ఢీకొడంతో లారీ ముందు భాగంగ దెబ్బతింది. తాడిపత్రి వైపు గ్రానైట్ రాయిని తీసుకువస్తున్న లారీ చింతకుంట సమీపంలో మరమ్మత్తుకు గురవడంతో డ్రైవర్ రోడ్డు పక్కన నిలిపాడు. అదే వైపు నుంచి మరో లారీ అతి వేగంగా వచ్చి ఢీకొనడంతో లారీ క్యాబిన్ ఎడమ వైపు దెబ్బతింది. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు.

వరిపంటను నాశనం చేసిన అడవిపందులు



నాశనం చేసిన వరిపైరు వద్ద రైతు

కలసపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తాను ఎంతో కష్టపడి పండించుకున్న వరి పంటను అడవి పందు లు నాశనం చేశాయని సింగరాయపల్లె గ్రామా నికి చెందిన భాస్కర్ (ఆసాది) అనే రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఒకటిన్నర ఎకరంలో రూ.50వేలు ఖర్చుచేసి వరిపైరును సాగుచేసినట్లు తెలిపారు. వారం రోజుల్లో పంటను కోయాల్సి ఉండగా గురువారం తెల్లవారుజామున దాదాపు ఒకటిన్నర ఎకరాకు పైగా పంటను తొక్కి పాడు చేశాయని వాపోయారు.

ఉల్లాసంగా జిల్లా స్థాయి పారా అథ్లెటిక్స్ క్రీడలు



ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను సత్కరిస్తున్న దృశ్యం

కడప స్పోర్ట్స్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక డీఎస్ఏ స్టేడియంలో జిల్లా స్థాయి పారా అథ్లెటిక్స్ క్రీడా పోటీలు నిర్వహించారు. ఇందులో బ్యాడ్మిం టన్, చెస్, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలలో పలువురు బాల, బాలికలు హాజరై ఉల్లాసంగా పాల్గొన్నారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎస్.గౌస్‌బాషా ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడాపోటీలను విభిన్న, టీజీ, సీనియర్ సిటిజన్ల అధికారి ఆర్‌వీ కృష్ణకిశోర్, పారా అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా కార్య దర్శి దామోదర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ (డబుల్స్-సింగిల్) క్రీడలలో ప్రతిభ కనబరచిన 10 మంది ఎంపిక చేశారన్నారు. వీరు గుంటూరు డీఎస్ఏ మైదానంలో డిసెంబరు 1, 2 తేదీలలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. వాలీబాల్, అథ్లెటిక్స్ చెస్ పోటీలలో ప్రథమ, ద్వితీయ విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్స్ మైదానంలోనే అందజేశారు. కాగా చివరగా రాష్ట్ర, జాతీయ స్థాయిలో పారా అథ్లెట్ల విజేతగా నిలిచినఉప్పు అభినవ్‌తో పాటు జిల్లా పారా క్రికెట్ క్రీడాకారుడు వై. వెంకటసుబ్బాస్, బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పి.ఓబులేసు (జామవా)లను సత్కరించారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



వైద్యశిబిరం ప్రారంభిస్తున్న ఎస్పీ నచికేత్

కడప క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నిరంతరం విధుల్లో ఉండే పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి.. సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ సూచించారు. గురువారం నగరంలోని జిల్లా పోలీసు సంక్షేమ ఆసుపత్రిలో హైదరాబాదుకు చెందిన చిరంజీవి హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చిరంజీవి హాస్పిటల్స్‌కు వారు సామాజిక బాధ్యతగా పోలీసు సిబ్బందికి వైద్యశిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పోలీసులు ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలరన్నారు. పోలీసు కుటుంబాలు, రిటైరైన పోలీసు సిబ్బంది, వారి కుటుంబాలు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య శిబిరంలో నిపుణులైన వైద్యుల ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. డాక్టర్ కె.సంజీవరావు, శిల్పాపొన్నాడ, క్రిష్ణవంశీ, జయశ్రీ, సిద్దార్థరెడ్డి శిబిరంలో పాల్గొన్నారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ప్రకాశ్‌బాబు, ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య, ఏఆర్ డీఎస్పీ నాగేశ్వర్‌రావు, పోలీసు యూనిట్ డాక్టర్ రేష్మ, ఆర్ఐ శ్రీశైలరెడ్డి, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పుశంకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభమైన పీజీ పరీక్షలు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వ విద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేషన్ తృతీయ సెమిస్టర్ పరీ క్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు 91శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. వైవీయూ పోస్ట్ గ్రాడ్యు యేషన్ తృతీయ సెమిస్టర్ పరీక్షలకు 490 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 450 మంది విద్యార్థులు హాజరు కాగా, 40 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ కేఎస్‌వీ కృష్ణారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ కాత్యాయని మార్గదర్శకంలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. అబ్జర్వర్ డాక్టర్ కె.మృత్యుంజయరావు పర్యవేక్షించారు. పరీక్షల నిర్వహణలో అసిస్టెంట్ చీఫ్ సూపరిం టెండెంట్ డాక్టర్ మునికు మారి, సిబ్బంది ఉన్నారు.

పర్వతారోహణ క్యాంప్‌లతో ఆత్మవిశ్వాసం పెంపు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పర్వతారోహణం క్యాంప్‌లు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రధాన ఆచార్యులు డాక్టర్ జి.రవీంద్రనాథ్ అన్నారు. నవంబరు 10వ తేదీ నుంచి 21వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో జాతీయస్థాయిలో నిర్వహించిన పర్వతారోహణం క్యాంప్‌లో ఆంధ్రప్రదేశ్ తరఫున పాల్గొని ప్రతిభ కనబరిచిన ఎన్‌సీసీ క్యాడెట్లు బీఎస్సీ కంప్యూటర్స్ సైన్స్ విద్యార్థి సయ్యద్ అలీ, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విద్యార్థి మహమ్మద్‌లను కళాశాలలోని ప్రిన్సిపాల్ అభినందించారు. ఎన్‌సీసీ అధికారులు కెప్టెన్ డాక్టర్ నీలయ్య, లెఫ్టినెంట్ మహేష్, డాక్టర్ సురేష్‌బాబు, డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, క్యాడెట్లు పాల్గొన్నారు.

షార్ట్ టర్మ్ ప్రొఫెషనల్ సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యాశాఖ ఆంధ్రప్రదేశ్ 2025-26 విద్యాసంవత్సరానికి షార్ట్‌టర్మ్ ప్రొఫెషనల్ సర్టిఫికెట్ కోర్సులు (ఎస్‌టీపీసీ) ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ప్రభుత్వ మహిళ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా నోడల్ ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి తెలిపారు. ఈ కోర్సులకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు నవంబరు 28 నుంచి డిసెంబరు 10వ తేదీ మధ్య ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో అభ్యర్థులు రూ.400 ఫీజును చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. పూర్తి సమాచారాన్ని అధికారిక వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చని సూచించారు.

'అన్నమయ్య జిల్లాలో మమ్మల్ని చేర్చవద్దు'



డీఆర్‌వోకు వినతి పత్రం అందజేస్తున్న పెద్దపల్లి పంచాయతీ నాయకులు

కడప మారుతీనగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కడప నగరానికి కూతవేటు దూరంలో ఉన్న సిద్దవటం మండలంతో పాటు పెద్దపల్లి పంచాయతీని యధాతథంగా కడప జిల్లాలోనే ఉంచాలని ఆ గ్రామ పంచాయతీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఆ మేరకు గురువారం కడప కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ విశ్వేశ్వరనాయుడును కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. మా గ్రామ పంచాయతీ హద్దులు కడప కార్పొరేషన్‌కు సమీపంలో ఉండడంతో అధికారులను గంటలోపే కలిసి పనులు చేసుకుంటున్నామన్నారు. ఇప్పుడు పంచాయతీని అన్నమయ్య జిల్లాలో చేర్చడం వలన జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే 80 కిలోమీటర్లు పోవాల్సి వుంటుందన్నారు. దీంతో చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం స్పందించి సిద్దవటం మండలాన్ని కడప జిల్లాలోనే యధాతథంగా ఉంచాలని కోరారు.

నేటి నుంచి స్కూల్ బస్సుల తనిఖీ

సీకేదిన్నె, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం శుక్రవారం నుంచి డిసెంబరు 4వ తేదీ వరకు స్కూలు బస్సులు తనిఖీ చేయనున్నట్లు ఇన్‌చార్జి ఉప రవాణా కమిషనర్ ఎం.వీర్రాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే పాఠశాల యాజమాన్యాలకు ఈ తనిఖీలపై తెలియజేశామని, లోటుపాట్లపై సవరణ చేసుకోవాలని అన్ని విద్యాశాఖ కార్యాలయాలకు నోటీసులు కూడా పంపించామన్నారు. తనిఖీల్లో అగ్నిమాపక పరికరాలు, ఎమర్జెన్సీ ఎగ్జిట్, వాహనాల పనితీరు సమగ్రంగా తనిఖీ చేస్తామన్నారు. యాజమాన్యాలు బస్సుకు సంబంధించిన వివరాలను అందుబాటులో ఉంచి రవాణా శాఖకు సహకరించాలని కోరారు.

జాతీయ హాకీ జట్టుకు సాయి మోహన్ ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కడప నగరం మున్సిపల్ ఉన్నత పాఠశాల (మెయిన్) విద్యార్థి సాయిమోహన్ 69వ ఎస్‌జీఎఫ్ అండర్-19 బాలుర విభాగంలో జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. గురువారం మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో ప్రధానోపాధ్యాయురాలు ముబీన రెహనా విద్యార్థిని అభినందించారు. ఈనెల 20 నుంచి 24 వరకు వైజాగ్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో సాయి మోహన్ చక్కటి ప్రతిభ కనబ రచడంతో జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. త్వరలో రాజ స్థాన్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో ప్రాతినిథ్యం వహించనున్నారని తెలిపారు.

కడప జిల్లా వాసికి అరుదైన గుర్తింపు



కడప మారుతీనగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన 100 కాంపిటీటివ్ ఇంగ్లీష్ ఫ్యాకల్టీలలో కడప జిల్లాకు చెందిన ఎం.రత్నంకు అరుదైన గుర్తింపు దక్కింది. ఢిల్లీకి చెందిన నీతి అయోగ్, రాష్ట్రీయ నైతికత సమ్మాన్ వారు 2025 సంవత్సరానికి దేశ వ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో ప్రసిద్ధిగాంచిన 100 కాంపి టీటివ్ ఇంగ్లీష్ ఫ్యాకల్టీ సర్వేలో కడప నగరం ఆలంఖాన్ పల్లెకు చెందిన రత్నంకు చోటు లభించింది. అందుకు గాను ఆయనకు కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రశంసాపత్రం అందజేశారు.

ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన

ఖాజీపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఖాజీపేట మోడల్ స్కూల్లో ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుడు ఓ విద్యార్థినికి ప్రేమలేఖ రాయడంతో పాటు అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీనిపై సహచర విద్యార్థులు ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఈ విషయాన్ని బయటకు పొక్కకుండా ఆ ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకున్నట్లు సమాచారం. కాగా ఈ విషయమై పాఠశాల ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా ఉపాధ్యాయుడికి గత నాలుగు రోజులుగా మతిస్థిమితం బాగాలేదని, దాంతో ఉన్నతా ధికారులకు సమాచారం ఇచ్చామని తెలిపారు.

తార ప్లాంట్‌లో వస్తువులు కాల్చివేత

ముద్దనూరు నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి చిన్న దుద్యాల గ్రామ సమీపంలో నున్న తార ప్లాంట్‌లో వస్తువులను బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కాల్చివేసినట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. రాత్రి ప్లాంట్‌లో నున్న గదిలో సెక్యూరిటీ గార్డు నిద్రపోతుండగా గుర్తుతెలియని వ్యక్తులు గదికి తాళం వేసి, ప్లాంట్‌లోని వస్తువులకు నిప్పు పెట్టి కాల్చివేశారు. ప్లాంట్ సూపర్‌వైజర్ కొర్రపాటి ప్రతాపరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బతికి ఉండగానే... భార్యకు డెత్ సర్టిఫికెట్

● భర్తపై పోలీసులకు ఫిర్యాదు



కలసపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తాను బతికి ఉండగానే చనిపోయినట్లు తన భర్త డెత్ సర్టిఫికెట్ కొరియర్ ద్వారా పంపాడని ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కలసపాడు మండలం దూలం వారిపల్లెకు చెందిన ఆదిలక్ష్మి అనే మహిళ గురువారం న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించింది. గ్రామానికి చెందిన అంకయ్య, ఓబు శమ్మల కుమార్తె ఆదిలక్ష్మిని 18 సంవత్సరాల క్రితం ముద్దనూరుకు చెందిన పొన్నా మారుతి రాజుకు ఇచ్చి వివాహం చేశారు. వారికి ముగ్గురు మగపిల్లలు ఉన్నారు. గత కొన్ని రోజుల నుంచి భార్య భర్తల మధ్య చిన్నచిన్న గొడవలు జరుగుతుండేవి. విసుగు చెందిన ఆమె 15రోజుల క్రితం స్వగ్రామమైన కలసపాడు మండలం దూలంవారిపల్లెకు చేరుకుంది. గురువారం కొరియర్ ద్వారా వచ్చిన డెత్ సర్టిఫికెట్‌ను గ్రామస్థుల ద్వారా తెలుసుకున్న ఆమె అవాక్కైంది. విషయం తల్లితండ్రులకు తెలిపి కలసపాడు పోలీసులను ఆశ్రయించి తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేసింది. సర్టిఫికెట్ ఎవరు ఇచ్చారు, అది ఎంత వరకు నిజమైంది, ఎవరు పంపారు అనే విషయం పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

భార్య రాకపోవడంతోనే...

తన భార్య ముగ్గురు పిల్లలను వదిలి పోయిందని.. చాలా సార్లు తమ వద్దకు రావాలని చెప్పినా వినకపోవడంతోనే.. తన తల్లి పేరుతో ఉన్న డెత్ సర్టిఫికెట్‌ను మార్పు చేసి పంపాల్సి వచ్చిందని మారుతి రాజు తెలిపాడు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఎస్టీయూ మండల కమిటీ ఎన్నిక

ఓబులవారిపల్లె, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముక్కావారిపల్లె జడ్పీ హైస్కూలులో గురువారం రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం మండల స్థాయి సమావేశం నిర్వహించి, కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా కోడూరుకు చెందిన కిరణ్‌కుమార్ వ్యవహరించారు. మండల యూనియన్ అధ్యక్షుడిగా వీవీ సోమేశ్వరరావు, జనరల్ సెక్రటరీగా కె.నాగేంద్ర, ఆర్థిక కార్యదర్శిగా పాణ్యం సురేశ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలో ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యాయుడు ఆదినారాయణరెడ్డి, జిల్లా నాయకులు బాలసుబ్రమణ్యం, సీనియర్ మండల యూనియన్ సభ్యులు సుబ్బరాయుడు, ఉదయ భాస్కర్, రవికుమార్, నరసింహారెడ్డి, పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిట్వేలి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : బాకరాపురం 11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేస్తున్నందున చెర్లోపల్లె, రాజుకుంట గ్రామాలకు శుక్ర, శనివారాలలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వెంకటచలపతి తెలిపారు. ఈ రెండు రోజుల్లో ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు త్రీఫేజ్ కరెంటు సరఫరా ఉంటుందని, ఆ సమయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సాయంత్రం ఐదు గంటల నుంచి 2 ఫేజ్ సరఫరా ఉంటుందని తెలిపారు. వినియోగదారులు అంతరాయాన్ని గమనించి సహకరించాలని ఏఈ కోరారు.

ఆర్థికశాఖ మంత్రిని కలిసిన అనుంపల్లి



ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసి సన్మానిస్తున్న అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతిలోని సచివాలయంలో గురు వారం ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి కలిశారు. మంత్రిని శాలువాలతో సత్కరించారు. రాయచోటి మార్కెట్ యార్డు అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. బంజారా నాయకులు జయరాం అఖండనాయక్ పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

రాయచోటిటౌన్, నవంబరు27(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని అర్బన్ సీఐ వెంకటచలపతి హెచ్చరించారు. పట్టణంలోని కొత్తపేట, జగదాంబ సెంటర్, మదనపల్లె రోడ్డు, శివాలయం సర్కిల్ మీదుగా నేతాజీ సర్కిల్, బస్టాండు కూడలి వరకు ఎస్ఐ విష్ణువర్ధన్, పోలీసు సిబ్బందితో కలిసి విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాష్ డ్రైవింగ్, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, పాఠశాలలు, కళాశాలలు వద్ద ఈవ్‌టీజింగ్ వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫుట్‌పాత్‌లపై దుకాణాల ఏర్పాటుతో పాదచారులు ఇబ్బందులు పడకుండా వ్యాపారాలు చేసుకోవాలని వ్యాపారస్తులకు సూచించారు.

'స్థానిక ఎన్నికల్లో విజయానికి కృషి చేయాలి'



ఒంటిమిట్ట: టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న చమర్తి

ఒంటిమిట్ట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాబోయే స్థానిక సంస్థలఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ విజయవానికి ప్రతిఒక్కరు కృషి చేయాలని రాజంపేట నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు పిలుపునిచ్చారు. గురువారం ఒంటిమిట్టలో టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల అభివృద్ధికి తెలుగుదేశంపార్టీ కట్టుబడి ఉందన్నారు. మొన్న జరిగిన జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ప్రజలు తమను ఆదరించినట్లుగానే రాబోయే ఎన్నికల్లో కూడా ఆదరించాలన్నారు. పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని, ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందాలన్న లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పని చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల కేంద్రాలోని టీడీపీ కార్యాలయాల్లో నాయకులు అందుబాటులో ఉండి ప్రజల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు ముద్దు కృష్ణారెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు ఎస్వీ రమణ, ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, క్లస్టర్ కన్వీనర్ తుమ్మలకుంట ఈశ్వరయ్య, కోకన్వీనర్ కట్టా సుబ్బరాయుడు, బొబ్బిలి రాయుడు, సాలాబాదు బుజ్జి నరసింహులు, కట్టా యానాదయ్య, గజ్జల శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

సిద్దవటం: అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాజంపేట నియోజకవర్గ నాయకురాలు కోటపాటి సుబ్బమ్మ గురువారం చమర్తి జగన్‌మోహన్‌రాజు సమక్షంలో రాజంపేట టీడీపీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీ అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరానని తెలిపారు.

గంగమ్మకు హారతి

నందలూరు: మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు లేబాకు చెరువు నిండి అలుగు పారుతుండడంతో టీడీపీ నాయకుడు కోడూరు బాలసుబ్రమణ్యం, నియోజకవర్గ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు గంగమ్మకు జలహారతి సమర్పించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు జంగంశెట్టి సుబ్బయ్య, సొసైటీ చైర్మన్ పసుపులేటి ప్రవీణ్‌కుమార్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేపూరి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకోవాలి

● సీపీఐ జిల్లా సమితి నేతల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సీపీఐ కార్యదర్శి మహేశ్

రాయచోటి టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమిస్తున్న వ్యక్తులతోపాటు వాటిని రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్ట్రార్లపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పీ.మహేశ్, నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాఠశాలలు, ఆసుపత్రులు, రహదారులు, ప్రజా సౌకర్యాల కోసం కేటాయించాల్సిన ప్రభుత్వ భూములను కొందరు ఆక్రమించుకుని వ్యక్తిగత లాభాల కోసం వాడుకుంటున్నారని ఆరోపించారు. ఈ ఆక్రమణలు జిల్లా అభివృద్ధికి ప్రధాన అడ్డంకిగా మారాయని, జిల్లాలో ప్రభుత్వ భూములపై తక్షణం సర్వే నిర్వహించి ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములు ప్రజల సంపదని, వాటిని కాపాడడం ప్రభుత్వ బాధ్యతన్నారు. జిల్లాలోని అట్టడుగు వర్గాలకు భూమి పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, నాయకులు జగన్‌బాబు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మాక్ అసెంబ్లీలో పాల్గొన్న విద్యార్థినులకు అభినందన



నూర్‌ఆయేషాను అభినందిస్తున్న కస్తూరి తదితరులు



దీక్షితను సన్మానిస్తున్న వీఆర్‌డీఎస్ సురేంద్రారెడ్డి తదితరులు

పెనగలూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రాజధాని విజయవాడలో బుధవారం నిర్వహించిన మాక్ అసెంబ్లీలో పాల్గొన్న పెనగలూరు విద్యార్థిని షేక్ నూర్ ఆయేషాను గురువారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు పెనగలూరు టీడీపీ కార్యాలయంలో అభినందించారు. మాక్ అసెంబ్లిలో పాల్గొనేందుకు పాఠశాల మండల స్థాయి, నియోజకవర్గ స్థాయిలో పలురకాల పరీక్షలను తన మేధస్సుతో విజయవంతంగా ఎదుర్కొని అసెంబ్లికి వెళ్లి రావడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా తన కుమార్తె ఉన్నతంగా ఎదిగేందుకు సహకారమందించాలని బాలిక తండ్రి మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎస్. షామీర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంసీ మాజీ చైర్మన్ విశ్వేశ్వరనాయుడు, రాజంపేట పార్లమెంట్ రైతు నాయకుడు పెరుగు కృష్ణయ్య నాయుడు, సీనియర్ నాయకులు నారాయణరెడ్డి, కస్తూరి శివ, రామయ్య, కట్టువారిపల్లె క్లస్టర్ ఇన్‌చార్జి నాగేశ్వరరావునాయుడు పాల్గొన్నారు.

దీక్షితకు ఘనసన్మానం

వీరబల్లి: రాష్ట్ర మాక్ అసెంబ్లీలో పాల్గొనడం ఒక అద్భుతమైన అనుభవమని వీఆర్‌డీఎస్ సురేంద్రారెడ్డి తెలిపారు. వీరబల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి మాక్ అసెంబ్లీకి ఎంపికైన విద్యార్థిని దీక్షితకు పాఠశాల అధ్యాపక బృందం ఏర్పాటు చేసిన అభినందన సభలో పాల్గొని సన్మానించారు. ఈ సందర్భంగా సురేంద్రారెడ్డి మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గం ఉండి వీరబల్లికి చెందిన విద్యార్థి ఎంపిక కావడం వెనుక ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని తెలిపారు. ప్రజాస్వామ్య ప్రక్రియలు, అసెంబ్లీ విధి విధానాలు, శాసనసభ సభ్యుల బాధ్యతలపై అవగాహన పెంచుకోవడానికి ఇది ఒక మంచి అవకాశమని తెలిపారు. విద్యార్థుల్లో నాయకత్వలక్షణాలను పెంపొందించడానికి మాక్ అసెంబ్లీ సహాయ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రెడ్డెయ్య, ఉపాధ్యాయులు, వీఆర్‌డీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం



రైతన్నా మీకోసం కార్యక్రమంలో టీడీపీ నేతలు

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని లక్కిరెడ్డిపల్లె మండల టీడీపీ ఇన్‌చార్జి యనమల మదన్‌మోహన్ తెలిపారు. గురువారం మద్దిరేవుల గ్రామం బూడిదగుంటపల్లెలో రైతన్న మీకోసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలను తెలుసుకున్నారు. ఏవో రాజకుమారి, హెచ్‌వో సింధూరి, వ్యవసాయ అధికారులు, సచివాలయ సిబ్బంది, రైతులు, మద్దిరేవుల గ్రామ ప్రజలు పాల్గొన్నారు. నూతనంగా ఏర్పడిన మండల కమిటీల సభ్యులు, క్లస్టర్, కోకన్వీనర్లు, యూని ట్, బూత్ ఇన్‌చార్జిలకు శుభాకాంక్షలు తెలియ జేశారు

అర్జీలను పరిష్కరించండి

పీజీఆర్ఎస్‌లో వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని యనమల మదన్‌మోహన్ తహసీల్దార్ క్రాంతికుమార్‌ను కోరారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌తో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో భూ ఆక్రమణలు చాలా జరిగాయని, భూములు కోల్పోయిన రైతులకు న్యాయం జరిగేలా రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజేశ్, వీఆర్‌వోలు ఆంజనేయులు, దళిత వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులేసు, శంకర, రమ్యరాయల్, శివమోహన్ నాయుడు, ఆర్కే హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకురాలికి సన్మానం



ప్రియాంకను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లె ఏపీ మోడల్ స్కూల్‌లో ఎకనామిక్స్ లెక్చరర్‌గా పని చేస్తున్న ప్రియాంక ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొంది సత్యసాయి జిల్లా అమ రాపురం ఏపీ మోడల్ స్కూల్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వరా ల రమేశ్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు ఆమెను సన్మానించా రు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రియాంక అతి చిన్న వయస్సులోనే పెద్ద బాధ్యతలు చేపట్టార న్నారు. ఇంకెన్నో ఉన్నత పదవులు అలంకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్ష పదవికి మన్సూర్ అలీఖాన్ దరఖాస్తు

రాయచోటిటౌన్, నవంబరు27(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి కోసం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆడిటర్ మన్సూర్‌అలీఖాన్ ఏఐసీసీ అబ్జర్వర్ మహేంద్రన్‌కు దరఖాస్తు అందజేశారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ కార్యా లయంలో గురువారం జరిగిన సంఘటన్ సృజన్ అభియాన్ (సంస్థాగత నిర్మాణ కార్యక్రమం) సందర్భంగా ఈ చర్య తీసుకున్నారు. పార్టీ అధిష్టానం ఆదేశాలకు కట్టుబడి రాహుల్‌గాంధీ నాయకత్వంలో జిల్లాలోని 7 నియోజకవర్గాల్లో పార్టీ అభివృద్ధి, ప్రజా సమస్యలపై పోరాడేందుకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని నేను అన్ని విధాలుగా అర్హత కలిగి ఉన్నాయని తెలియజేస్తున్నానంటూ దరఖాస్తులో పేర్కొన్నారు.

అవగాహనతో క్షయ వ్యాధిని దూరం చేద్దాం



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): : అవగాహనతో క్షయవ్యాధిని దూరం చేద్దామని టీబీ సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, ల్యాబ్ టెక్నీషియన్ గంగయ్య పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో దూళ్లవారిపల్లెలో హెల్త్ అవేర్నెస్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామంలోని సమస్యలు, ఆరోగ్య పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత, క్షయవ్యాధిపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దగ్గు, శరీరం క్షీణించుట, జ్వరం రావడం వంటి లక్షణాలున్న వారు వెంటనే ఆసుపత్రికి వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. క్షయ వ్యాధి గ్రస్తులకు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా చికిత్స చేస్తారన్నారు. ఆరోగ్యశాఖ సిబ్బంది గంగయ్య, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు రామాపురం మండల సమావేశం

రామాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ సభాభవనంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల అధ్యక్షురాలు గడికోట విజయలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జాషువా తెలిపారు. ఈ సమావేశంలో సాగునీరు, విద్యుత్, ఉపాధి, వైద్య ఆరోగ్యం, పశుసంవర్ధకశాఖ, హౌసింగ్, వ్యవసాయం, నాడు- నేడు తదితర శాఖలపై చర్చిస్తామని జెడ్పీటీసీ మెంబర్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు హాజరు కావాలని కోరారు

కూటమి ప్రభుత్వంలోనే ఆర్యవైశ్యులకు గుర్తింపు

● రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేశ్



ప్రమాణ స్వీకారం చేస్తున్న పెండ్యాల విజయ్ కుమార్

రైల్వేకోడూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో ఆర్యవైశ్యులకు గుర్తింపు వచ్చిందని రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మ న్ డూండీ రాకేశ్ తెలిపారు. గురువారం స్థానిక ఆర్యవైశ్య ఉత్సవ మండపంలో ఏర్పాటు చేసి రైల్వేకోడూరు ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు పెండ్యాల విజయ్ కుమార్ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్యవైశ్యులకు గుర్తింపు తీసుకొ చ్చింది టీడీపీ ప్రభుత్వమేనన్నారు. ఆర్యవైశ్యుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అనేక కార్యక్రమలు రూపొందించిందన్నారు. నూతన అధ్యక్షుడు పెండ్యాల విజయ్‌కుమార్ వాసవీ క్లబ్ ద్వారా అనేక కార్యక్రమాలు చేసి మన్ననలు పొందాడన్నారు. పేద ఆర్యవైశ్యులను దృష్టిలో ఉంచుకుని సేవా కార్యక్రమాలను నిరంతరాయంగా చేయాలన్నారు. అనంతరం ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్, డీసీఎంఎస్ చైర్మన్ ఎర్రగుండ్ల జయప్రకాష్, రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల చైర్మన్ కేకే చౌదరి, ఆర్యవైశ్య సంఘం నాయకులు కామిశెట్టి చక్రవర్తి, కామిశెట్టి నేతాజీ, కామిశెట్టి బద్రినాథ్, కామిశెట్టి గోపీనాథ్, ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు తిరునామాల కుమార్, కలువా సోమశేఖర్, టీడీపీ రైల్వేకోడూరు తదితరులు పాల్గొన్నారు.

'పని వేళలు పాటించని ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలి'

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది పనివేళలు పాటించడం లేదంటూ గురువారం మండలంలోని కస్తూరిరాజుగారిపల్లె గ్రామ సచివాలయం ఎదుట రాయచోటి నియోజకవర్గ సీపీఐ కార్య దర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రజలు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సమయానికి కార్యాలయానికి రాకపోవడం, ఒకవేళ వచ్చినా కంప్యూటర్, ప్రింటర్ , నెట్‌వర్క్ ఏదో ఒకటి పనిచేయలేదంటూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఆయా సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిజిటల్ అసిస్టెంట్ డబ్బు వసూలు చేస్తున్నాడని ఆరోపించాడు. ఈ వ్యవ హారంపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు వెంకట్రమణ, శివశంకర్, ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ విధానాలను పాటించాలి

రాయచోటి నేతాజీ సర్కిల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రైతులందరూ ప్రకృతి వ్యవసాయ విధానాన్ని పాటించాలని మండల టీడీపీ అధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారం సంబేపల్లె మండలం మోటకట్ల గ్రామంలోని తన మామిడి తోటలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో కలిసి 22 రకాల విత్తనాలను బీజామృతంతో విత్తనశుద్ధి చేసి దుక్కిలో ఘన జీవామృతం వేసి ఆర్‌డీఎస్ చేశారు. ఈ విధంగా మామిడి తోటలో నేలను 365 రోజులు కప్పి ఉంచవచ్చునని తెలిపారు. తద్వారా నేల పోషకాలు కోల్పోకుండా ఉంటుందని తెలిపారు. రసాయన ఎరువులు తగ్గించడంతో మామిడిలో దిగుబడి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది స్టేట్ వైపీఎన్ ఆదిత్యరామ్, పవన్‌రెడ్డి, ఎంటీ మానస, ఎఫ్ఎంటీలు సుబ్రమణ్యచారి, లక్ష్మి, ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలి

రైల్వేకోడూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కోడూరు పంచాయతీ కార్యాలయంలో నిధుల దుర్వినియోగంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం రైల్వేకోడూరు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటి ప్లాన్ అప్రూవల్స్, పంచాయతీ ట్రాక్టర్లు, డ్రైనేజి క్లీనింగ్, డీజిల్ బిల్లుల గోల్‌మాల్, రికార్డుల తారుమారుకు పాల్పడిన అధికారులు, సిబ్బందిని సస్పెండ్ చేయాలన్నారు. ఈ అంశాలపై ఇది వరకే అధికారులు విచారణ చేసినా ప్రయోజనం లేదన్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన అధికారులతో విచారణ చేయించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు హరినారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం




సీఎం, డిప్యూటీసీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

రాయచోటిటౌన్, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటి కొనసాగుతుందని రాష్ట్ర రవా ణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాం ప్ర సాద్‌రెడ్డి కరాఖండిగా చెప్పడం తో గురువారం మండల పరిధి లోని శిబ్యాల గ్రామంలో రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. అన్నమయ్య జిల్లా ప్రజలకు అన్యాయం జరగదని సవాల్ చేసిన మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియ జేశారు.

సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

పుల్లంపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండల పరి ధిలోని దండ్లోపల్లె అరుంధతివాడలో గురువారం సీతారామలక్ష్మణ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పాల్గొన్నారు. వేదపండితులు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికి, పూజలు చేయించి తీర్థ ప్రసాదాలు అంద జేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముక్కా సాయివికాస్‌రెడ్డి, చంద్రశేఖర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సుండుపల్లె మండల టీడీపీ అధ్యక్షుడిగా రమేశ్‌నాయుడు



సుండుపల్లె, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సుండుపల్లె మండల టీడీపీ అధ్యక్షుడిగా చప్పిడి రమేశ్‌నాయుడు నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాజంపేటలో నిర్వహించిన ప్రమాణ స్వీకారోత్సవానికి సుండుపల్లె నుంచి భారీగా తరలివెళ్లారు. పెద్ద మండల ప్రధాన కార్యదర్శిగా భాగంపల్లి యూసుఫ్, 9వ క్లస్టర్ కోకన్వీనర్‌గా మహేశ్వర్మను ఎన్నుకున్నట్లు తెలిపారు. మండలాధ్యక్షుడుగా ఎంపికైన రమేశ్‌నాయుడు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అభివృద్ధి కోసం కష్టపడి పని చేస్తామని హామీ ఇచ్చారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



స్వామి వారి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

సుండుపల్లె, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివాలయ ప్రాంగణంలో శ్రీదేవి భూదేవి, వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు గురువారం ప్రాణప్రతిష్ఠ చేశారు. స్థానిక వినాయకనగర్‌కు చెందిన మేస్త్రీ నంద్యాల వెంకట్రమణ కుటుంబ సభ్యులు సుమారు 5 లక్షలు వెచ్చించి ఈ విగ్రహాలను తయారు చేయించారు. శివాలయ అర్చకుడు హరికృష్ణ ఆధ్వర్యంలో వినాయకనగర్‌లోని దాత నివాసం నుంచి విగ్రహాలను ప్రత్యేక రథంలో శివాలయానికి తీసుకు వచ్చారు. సాయంత్రం బాణసంచా, డప్పు వాయిద్యాల నడుమ స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యం

ఏఐసీసీ అబ్జర్వర్ మహేంద్రన్



సమావేశంలో మాట్లాడుతున్న మహేంద్రన్

రాయచోటిటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడమే తమ ప్రధాన లక్ష్యమని ఏఐసీసీ అబ్జర్వర్ కె.మహేంద్రన్ తెలిపారు. గురువారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సంఘటన్ సృజన్ అభియాన్ (సంస్థాగత నిర్మాణ కార్యక్రమం) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థాగత నిర్మాణంలో భాగంగా అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి ఆసక్తి కలిగిన నాయకుల నుంచి దరఖాస్తులను స్వీకరించినట్లు తెలిపారు. నియోజకవర్గాల వారీగా సమీక్షలు నిర్వహిస్తూ పార్టీ అభివృద్ధికి పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగా జిల్లా పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రత్యేక సమీక్షా సమావేశాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. అనంతరం ఏపీసీసీ అబ్జర్వర్ అశోక్‌రత్నం, అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజుల భాస్కర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పీసీసీ ప్రతినిధి ఎస్ఎండీ గౌస్, జిల్లాలోని అన్ని నియోజకవర్గాల కో-ఆర్డినేటర్లు, జిల్లా కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ ప్రతినిధులు, సేవాదళ్ సభ్యులు, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా కిరణ్‌కుమార్


ఓసూరి కిరణ్‌కుమార్

మదనపల్లె అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా మదనపల్లె మండలం సీటీఎంకు చెందిన ఓసూరి కిరణ్‌కుమార్‌ను నియమించినట్లు ఆ పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సి.కుమార్‌స్వామి, మేమిరెడ్డి సురేంద్రనాథరెడ్డిలు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అభివృద్ధి కోసం వ్యవసాయ పురోభివృద్ధికి తోడ్పాటు ఇస్తూ రైతులకు శిక్షణ, మార్కెట్ ఎగుమతి అవకాశాలు, ఆధునిక సాంకేతిక వ్యవసాయం, సహకార వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

ఆయుష్ ఆసుపత్రి నిర్మాణ స్థలం పరిశీలన


డాక్యుమెంట్స్‌ను పరిశీలిస్తున్న జేసీ

రాయచోటి (నేతాజీసర్కిల్), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆయుష్ ఆసుపత్రి నిర్మించేందుకు ఎంపిక చేసిన స్థలాన్ని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ స్థలానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. సర్వే అధికారులు, రెవెన్యూ సిబ్బంది సంబంధిత వివరాలను ఆయనకు వివరించారు.

విద్యార్థులతో ప్రాజెక్టులు చేయించాలి



మాట్లాడుతున్న యూనిసెఫ్ ప్రతినిధి సుదర్శన్

రాయచోటిటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అటల్ టింకరింగ్ ప్రయోగశాలలో అటల్ క్యాలెండర్‌ను అనుసరించి క్రమం తప్పకుండా విద్యార్థులతో ప్రాజెక్టులు చేయించాలని యునిసెఫ్ ప్రతినిధి సుదర్శన్ సూచించారు. స్థానిక మాసాపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అటల్ టింకరింగ్ పాఠశాల వర్క్‌షాప్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఉపాధ్యాయులు రూపొందిస్తున్న ప్రాజెక్టులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ అటల్ టింకరింగ్ ప్రయోగశాలలో అటల్ క్యాలెండర్‌ను అనుసరించి క్రమం తప్పకుండా విద్యార్థులతో ప్రాజెక్టులు చేయించాలని సూచించారు. అటల్ ప్రయోగశాలలో కార్యక్రమాలను సక్రమంగా నిర్వహిస్తే విద్యార్థులు శాస్త్రవేత్తలుగా, వ్యవస్థాపకులుగానూ రూపొందుతారన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అసిస్టెంట్ ఏఎంవో అసదుల్లా, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, రీసోర్స్ పర్సన్స్ ఆంజనేయులు, వేణుగోపాల్‌రెడ్డి, మహబూబ్‌బాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హరినామ సంకీర్తనలతో పులకించిన సంబేపల్లె



రథంపై స్వామి ఊరేగింపు, పాదయాత్రలో హరేకృష్ణ- హరేరామ భక్తులు

రాయచోటి (నేతాజీ సర్కిల్), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ కృష్ణచైతన్య సంఘం (ఇస్కాన్) నిర్వహిస్తున్న 7వ పాదయాత్ర బృందం గురువారం సంబేపల్లెకు చేరుకుంది. కృష్ణ- బలరాములు, భక్తివేదాంత స్వామి ప్రభుపాద విగ్రహాలు కలిగిన రథం, దానికి కట్టిన ఎద్దులు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఇస్కాన్ ప్రచారకులు మాట్లాడుతూ రోజుకు ఒక్కసారైనా హరేకృష్ణ-హరేరామ మహామంత్రాన్ని జపిస్తే మనసుకు శాంతి, జీవనానికి శోభ, ఆత్మకు ముక్తి లభిస్తుందన్నారు. 1984లో ప్రారంభమైన ఈ పాదయాత్ర ఇప్పటి వరకు ఆరుసార్లు విజయవంతంగా పూర్తి చేసుకుని ప్రస్తుతం 7వ పర్యాయం నడుస్తోందని తెలిపారు

ఏళ్ల తరబడి అద్దె భవనాల్లోనే...!

- శాశ్వత భవనాల గురించి పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు, ప్రజలు
- ఇదీ రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్, తపాలా కార్యాలయాల తీరు

సుండుపల్లె, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రజలతో సంబంధం ఉండే రెవెన్యూ, సబ్‌రిజిస్ట్రార్, తపాలా కార్యాలయాలు ఏళ్ల తరబడి అరకొర వసతులతో అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. చిన్నపాటి భవనాల్లో కార్యాలయాలు ఉండటంతో ఉద్యోగులతో పాటు పని నిమిత్తం వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కార్యాలయాలకు సొంత భవనాల నిర్మాణంపై అధికారులు దృష్టి సారించడం లేదు. అలాగని స్థలాల సమస్యా అంటే అదీ లేదు. సుండుపల్లె మండల కేంద్రంలో లక్షల విలువ చేసే ప్రభుత్వ స్థలాలు మాయమైపోతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో విలువైన ప్రభుత్వ స్థలాలను కొంతమంది వైసీపీ నాయకులు ఆక్రమించి అమ్మకాలు నిర్వహించారు. అక్రమ నిర్మాణాలు చేపట్టారు. కూటమి ప్రభుత్వంలోనైనా సొంత భవన నిర్మాణాలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.





అద్దె భవనాల్లో ఉన్న తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

దశాబ్దాలుగా అద్దె భవనాలే...

సుండుపల్లె మండల కేంద్రంలో దశాబ్దాలుగా అద్దె భవనంలోనే తహసీల్దార్ కార్యాలయం నిర్వహిస్తున్నారు. సుండుపల్లె అత్యంత మారుమూల మండలం. సుమారు 90 వేల పైచిలుకు జనాభా కలిగి మండలంలో శాశ్వత తహసీల్దార్ కార్యాలయం నిర్మించకపోవడంతో అద్దె భవనాల్లో సేవలు అందిస్తున్నారు. 15 గ్రామ పంచాయతీల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు పలు రకాల అవసరాల నిమిత్తం తహసీల్దార్ కార్యాలయానికి వస్తారు. సరైన భవన సదుపాయం లేకపోవడంతో రైతులు రెవెన్యూ సేవలకు దూరమవుతున్నారు. అధికారులు అందరూ కూర్చుని సేవలు అందించే పరిస్థితి లేదు. అద్దె భవనానికి నెలకు రూ.10 వేలు చెల్లిస్తున్నారు. మండల వ్యవస్థ ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటి వరకు అద్దె భవనాల్లో ఉంటూ సేవలు అందిస్తున్నా శాశ్వత నిర్మాణాలకు ఎటువంటి పురోగతి లేదు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కూడా అద్దె భవనంలో కొనసాగుతోంది. సుండుపల్లె మండల కేంద్రంలో 1995 సంవత్సరం నుంచి సబ్ రిజిస్ట్రార్ సేవలు ప్రజలకు అందిస్తున్నా ఇప్పటి వరకు శాశ్వత భవనం లేదు. సుమారు 30 సంవత్సరాల నుంచి లక్షల రూపాయలు అద్దె భవనాలకు ప్రభుత్వం నగదు చెల్లిస్తోంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనంకు అద్దె నెలకు రూ.10,619 చెల్లిస్తున్నారు. ఇదంతా ప్రభుత్వానికి పెనుభారంగా మారుతోంది.

సమస్యపై అధికారుల దృష్టికి



సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్తాము. ప్రస్తుతం అద్దె భవనంలో ఉన్నాము. ప్రతి నెలా ప్రభుత్వం అద్దె చెల్లిస్తోంది. శాశ్వత భవనం ఏర్పాటైతే రైతులకు, ప్రజలకు ఎంతో మేలుగా ఉంటుంది. మారుమూల మండలం పెద్ద మండలం కావడంతో పెద్ద సంఖ్యలో పలు సమస్యలపై ప్రజలు, రైతుల వస్తూ ఉంటారు. గతంలో దాతలు తహసీల్దార్ కార్యాలయం కోసం ఇచ్చిన స్థలంలో నిర్మించకూడదని కోర్టుకు వెళ్లారు. ప్రభుత్వ స్థలం చూసి ప్రతిపాదనలు పంపిస్తాము.

-మహబూబ్‌చాంద్, తహసీల్దార్, సుండుపల్లె

చిరునామాలు మారుస్తున్నారే గానీ...

సుండుపల్లెలో రెవెన్యూ కార్యాలయం ఒకచోట నుంచి మరొక అద్దె భవనంలోకి మారుస్తున్నారే కానీ ఇప్పటి వరకు సొంత భవన నిర్మాణం ఊసెత్తడం లేదు. తహసీల్దార్, సబ్‌రిజిస్ట్రార్ ఇంత ప్రధానమైన కార్యాలయాలు ఇరుకు గదుల అద్దె భవనంలో నిర్వహిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి అధికంగా ●ప్రప రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకే ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో రద్దీ అధికంగా ఉంటోంది. అయినా అధికారులు సొంత భవన నిర్మాణంపై దృష్టి పెట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఏడాదిన్నరకు ఎంపీ రాక..!

- వినతుల పేరిట పరామర్శలు
- ఎంపీని కలిసేందుకు వచ్చిన ప్రజలు బేజారు


ఎంపీడీవో కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్నఎంపీ మిథున్‌రెడ్డి

మదనపల్లె, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి.. ఏడాదిన్నర తర్వాత గురువారం మదనపల్లెకు విచ్చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను కలసిన పార్టీ శ్రేణులను పలకరిస్తూ, అన్నా..బాగున్నావా? పిల్లలు బాగున్నారా? ఏం చేస్తున్నారంటూ అడిగి తెలుసుకున్నారు. కాగా.. ఎంపీటీసీలు, అధికారులతో ఎంపీ సమీక్షిస్తారని, ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని వైసీపీ వారు ప్రచారం చేశారు. వైసీపీ నేతలే కాదు..అటు అధికారులు కూడా ఇదే ప్రచారం చేశారు.

దీంతో మదనపల్లె మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు నియోజకవర్గాల నుంచి కార్యకర్తలు హాజరయ్యారు. అలాగే అన్నిశాఖల అధికారులు కూడా హాజరయ్యారు. కానీ అక్కడ సమీక్ష లేదు. సమావేశం అంతకంటే లేదు. వచ్చినోళ్లంతా వచ్చినట్లు ఎంపీని వరుసగా వెళ్లి కలుస్తూ సన్మానించడం, సెల్ఫీలు, ఫొటోలకు పోటీపడ్డారు. దీంతో ఎంపీని కలిసేందుకు వచ్చిన ప్రజలు బేజారు పడ్డారు. ఎంపీ రాక సందర్భంగా వైసీపీ వారు ర్యాలీ చేయడంతో సీటీఎం రోడ్డు, చిత్తూరు బస్టాండు సర్కిల్‌లో వాహనాలు ఎక్కడిక్కడ నిలిచిపోయి అరగంటకుపైగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎంపీకి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి, వైసీపీ స్థానిక ఇన్‌చార్జి ఎస్.నిసార్‌అహ్మద్, ఆ పార్టీ యువనాయకుడు హర్షవర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీసభ్యుడు తట్టి శ్రీనివాసులురెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజ వేర్వేరుగా స్వాగతం పలికారు.

కాగా.. మదనపల్లెను జిల్లా చేయలేని ఎంపీ.. మదనపల్లె పర్యటనకు ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారని, ఎంపీ పర్యటనను అడ్డుకుంటామని తెలుగుయువత అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు బుధవారం ప్రకటించారు. ఈ నేపథ్యంలో గురువారం ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా స్థానిక వన్‌టౌన్, టూటౌన్ పోలీసులు నీరుగట్టువారి పల్లెలోని తెలుగుయువత అధ్యక్షుని నివాసానికి వెళ్లి ఆరా తీశారు. ఎంపీ పర్యటనను అడ్డుకుంటున్నారా? ఎక్కడైనా పార్టీశ్రేణులు ఆందోళనకు దిగే అవకాశం ఉందా? అంటూ ఆయన నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అక్రమాలపై విచారణకు

చిత్తూరు జిల్లా రిజిస్ట్రార్ నియామకం

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలోని బి.కొత్తకోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి అక్రమాలపై విచారణకు అన్నమయ్య జిల్లా ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా వ్యవహరిస్తున్న చిత్తూరు జిల్లా రిజిస్ట్రార్ ఎ.వెంకటరమణమూర్తిని రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ రామలక్ష్మీ పట్నాయక్ నియమించారు. ప్రభుత్వానికి అందిన ఫిర్యాదులపై కడప జిల్లా డీఐజీ రామలక్ష్మీ పట్నాయక్ ఈనెల 25న బి.కొత్తకోటకు చేరుకుని విచారణ జరిపారు. అక్కడి అక్రమాలపై పలువురు కక్షిదారులు సీఎం కార్యాలయానికి ఫిర్యాదు చేయడంతో ఇక్కడి అక్రమాల డొంక కదిలింది. పలువురు కక్షిదారులు సబ్ రిజిస్ట్రార్ అవినీతిపై పిటిషన్ల రూపంలో అక్రమాలను వివరించారు. ఆస్తులు, క్రయ, విక్రయదారులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే మార్కెట్ విలువలో ఒక శాతం లంచం రూపంలో ఇవ్వాల్సిందేనని, ఇవ్వకుంటే వివిధ రకాలుగా కొర్రీలు పెడుతూ రిజిస్ట్రేషన్ చేయకుండా వాయిదాలు వేశారని ఆరోపించారు. స్టాంపులను వెండర్లు అధిక ధరకు అమ్ముతున్నారని, ఈసీ నకళ్లు జారీ చేయడానికి అధిక లంచం అడుగుతున్నారని ఆరోపించారు. దీంతో చిత్తూరు జిల్లా రిజిస్ట్రార్ ఏఎస్ఆర్ మూర్తిని పిటిషనర్లకు నోటీసులు ఇచ్చి విచారణ చేసి నిజానిజాలు తేల్చాలని డీఐజీ రామలక్ష్మీ పట్నాయక్ ఆదేశించారు. కార్యాలయంలో సీసీటీవీ ఫుటేజీలను, ఫైళ్లను పరిశీలించి నివేదికను ఇవ్వాలని పేర్కొన్నారు.

'మీ డబ్బు మీ హక్కు' పోస్టర్ ఆవిష్కరణ

రాయచోటి(నేతాజీ సర్కిల్), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సేవల విభాగం సూచనల మేరకు మీ డబ్బు-మీ హక్కు కార్యక్రమం పోస్టర్‌ను జిల్లా ఎల్డీయం ఆంజనేయులు ఏపీజీబీ రాయచోటి కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ బ్యాంకుల్లో గత 10 సంవత్సరాల వరకు లావాదేవీలు జరపకుండా ఉన్న ఖాతాలు పునరుద్ధరించుకోవాల్సిందిగా ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో శాఖ నిర్వాహక అధికారి సదాశివరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మదనపల్లె అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర 8వ స్కై చాంపియన్ షిప్ 2025ను ఈనెల 23న స్కై మార్షల్ ఆర్ట్స్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లాలోని నంద్యాల పట్టణం, ఎన్టీఆర్ షాదీఖానాలో రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహించారు. ఇందులో మదనపల్లె విద్యార్థులు విశేష ప్రతిభ కనబర్చి అనేక మెడల్స్ సాధించారని ఏపీ స్కై కోచ్ ఎస్ ఖాదర్‌బాషా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 29 బంగారు పతకాలు సాధించడం పట్ల ఏపీ స్కై మార్షల్ ఆర్ట్స్ చైర్మన్ ఇస్మాయిల్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఇందులో 11 ఏళ్ల వయస్సు విభాగంలో నితీష్, కుషాల్ సాయి, సాత్విక, తహాఅర్షా, సాయి ప్రీతికలు, 14 ఏళ్ల విభాగంలో శైలజ, హర్షిత యశశ్వని, గణేష్, రెడ్డికావ్య, 18 ఏళ్ల విభాగంలో అయాన్, చరిత సాయి, లిఖిత్, గాయత్రి, సీనియర్ విభాగంలో ముహిజుద్దీన్ జుబేదర్, ముజహర్ ఆలి (ఓపెన్ కేటగిరి) ప్రతిభ చూపారు. గెలుపొందిన విద్యార్థులు జనవరి 5, 6, 7 తేదీల్లో హైదరాబాదులోని గచ్చిబౌలి స్టేడియంలో పాల్గొంటారని అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు నరసింహులు తెలిపారు.

విద్యార్థిని అభినందించిన కలెక్టర్


విద్యార్థిని అభినందిస్తున్న కలెక్టర్

గుర్రంకొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాక్ అసెంబ్లీ కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థి సుఫియాన్‌ను కలెక్టర్ నిశాంత్‌కుమార్ బుధవారం రాత్రి అభినందించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన పోటీ పరీక్షల్లో గుర్రంకొండ మండలం తరిగొండ జడ్పీ హైస్కూల్ పదవ తరగతి విద్యార్థి సుఫియాన్ ఉత్తమ ప్రతిభ చూపి ప్రథమ స్థానంలో నిలిచాడు. విద్యార్థిలోని ప్రతిభను గుర్తించిన కలెక్టర్ అభినందించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. పది పరీక్షలో మంచి మార్కులు సాధించాలని విద్యార్థికి సూచించారు. కార్యక్రమంలో డీఈవో సుబ్రమణ్యం, హెచ్ఎం రామచంద్ర, ఉపాధ్యాయులు కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

గుంజనేరులో వ్యక్తి మృతి

పెనగలూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గుంజనేరులో పడి ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఏఎస్ఐ రాముడు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... మండలంలోని కొండూరు పంచాయతీ తిరణంపల్లెకు చెందిన నన్నూరి రాజేశ్ (34) సిరిచాపల వ్యాపారం చేస్తుంటాడు. నాలుగు రోజులుగా అతను ఇంటికి రాలేదు. అతడి భార్య విజయ కుటుంబ సభ్యులు అతనికి ఫోన్ చేసినా స్పందించకపోవడంతో, వ్యాపారం పనిపై ఇతర ప్రాంతాలకు వెళ్లి ఉంటాడని భావించారు. ఈ నేపథ్యంలో గురువారం ఎ-రాచపల్లె సమీపంలో గుంజనేరులోని ముళ్ల పొదలకు తగులుకున్న మృతదేహాన్ని గుర్తించి స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహం తలకు చుట్టుకుని ఉన్న లుంగీ, టవల్‌ను పరిశీలించగా అందులో సెల్‌ఫోన్ లభించింది. దాని ఆధారంగా మృతుడు తిరణంపల్లెకు చెందిన రాజేశ్‌గా గుర్తించారు. మద్యం మత్తులో ప్రవాహంలోకి దిగడంతోనే అతను మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కుటుంబ సభ్యుల సమక్షంలో మృతదేహాన్ని రాజంపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఏఎస్ఐ తెలిపారు.

గుళికల మందు తిని బాలిక మృతి

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పెళ్లికి తీసుకెళ్లలేదని ఓ బాలిక గుళికల మందు తిని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు జె.వడ్డెపల్లెకు చెందిన లక్ష్మీ ప్రసన్న (15) బి.యర్రగుడి గ్రామంలో జరుగుతున్న తమ బంధువుల పెళ్లికి తానూ వస్తానని తల్లిని కోరింది. అందుకు ఆమె నిరాకరించడంతో మనస్తాపానికి గురై గుళికల మందు తినింది. విషయం గమనించి తల్లి ఆమెను రాయచోటి ప్రైవేటు ఆసుపత్రికి తరలించింది. పరిస్థితి విషమించడంతో తిరుపతికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందింది కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీంద్రబాబు తెలిపారు.

ఝార్ఖండ్ యువకుడు ఆత్మహత్య



మదనపల్లె అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన యువకుడు ఉరేసుకుని మృతిచెందిన సంఘటన మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. తాలుకా సీఐ కళావెంకటరమణ వివరాల మేరకు... ఝార్ఖండ్ రాష్ట్రం, హసేన్‌బాద్ జిల్లా, జామియా గ్రామానికి చెందిన రాంప్రీత్ వార్ కుమారుడు మోతిరావ్ వార్ (23) రాజంపేటకు చెందిన సెంట్రింగ్ మేస్త్రీ శ్రీనివాసులు వద్ద పనిచేస్తున్నాడు. పోతబోలు వద్ద ఓ ఇంటిపని చేస్తూ అక్కడే ఉంటున్నాడు. ఏమైందో కానీ గురువారం పోతబోలు కురవపల్లె సమీపంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పరిశీలించిన అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు సీఐ కళా వెంకటరమణ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

రామాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కువైత్‌కు వెళ్లిన భర్త తిరిగి రాలేదని మనస్థాపానికి గురై ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ వెంకట సుధాకర్‌రెడ్డి కథనం మేరకు... పుల్లంపేట మండలం కేతరాజుగారిపల్లెకు చెందిన లక్ష్మిదేవికి (36) అదే గ్రామానికి చెందిన వెంకటేశ్‌తో 2008లో వివాహమైంది. వారికి ఇంటర్మీడియట్ చదివే కూతురు, పదో తరగతి చదివే కుమారుడు ఉన్నారు. 2014లో ఈమె ఉపాధి నిమిత్తం కువైత్‌కు వెళ్లింది. అక్కడ రామాపురం మండలం గాండ్లపల్లెకు చెందిన సురేంద్రను రెండో వివాహం చేసుకుంది. ఇటీవల ఆమె ఒంటరిగానే తిరిగి వచ్చి రెండో భర్త ఇంట్లోనే నివసిస్తోంది. నాలుగు నెలలైనా భర్త ఇండియాకు తిరిగిరాకపోవడంతో మనస్థాపానికి గురై గురువారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న వీఆర్వో పుష్పరాజ్ రామాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వినీత్ మృతి కేసులో ముగ్గురికి బెయిలు మంజూరు

కలికిరి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వినీత్‌కుమార్‌రాజు మృతి కేసులో అరెస్ట్ అయిన నలుగురు నిందితులను కలికిరి పోలీసులు గురువారం వాయల్పాడు కోర్టులో హాజరుపరిచారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయాధికారి నిందితుల్లో ముగ్గురికి బెయిల్ మంజూరు చేశారు. నలుగురు నిందితుల్లో అబూబెకర్, పాలగిరి అహ్మద్, మందా నరేష్‌లను బెయిలుపై విడుదల చేశారు. వినీత్‌ను కారుతో ఢీకొట్టి అతడి మృతికి కారణమైన మరో నిందితుడు నౌషద్ బాషా (బబ్లూ)కు మాత్రం న్యాయాధికారి రిమాండు విధించారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులకు భూమి పూజ

- కడప-రేణిగుంట రహదారి పనులు ప్రారంభం
- 122 కిలోమీటర్లు.. రూ.3232 కోట్లు


రాజంపేట మండలం కూచివారిపల్లె వద్ద గ్రీన్‌ఫీల్డ్ హైవేకి భూమి పూజ చేస్తున్న కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు

రాజంపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సుమారు మూడేళ్లుగా తీవ్ర జాప్యానికి గురవుతున్న కడప-రేణిగుంట 716 గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులకు భూమి పూజ చేశారు. ఈ పనులను దక్కించుకున్న కాంట్రాక్టు ప్రతినిధులు బుధవారం రాజంపేట మండలం కూచివారిపల్లె వద్ద ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులకు భూమిపూజ చేసి పనులకు శ్రీకారం చుట్టారు. రెండేళ్లలో ఈ పనులు పూర్తి చేయడానికి సంబంధిత కాంట్రాక్టర్లు సిద్ధమయ్యారు. ప్రస్తుతం కడప-రేణిగుంట మధ్య రెండు లేన్ల రహదారి పూర్తిగా పాడై ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఈ సమయంలో మూడేళ్లుగా ఊరిస్తున్న నాలుగు లేన్ల రహదారికి భూమి పూజ జరగడంతో రెండేళ్లలో ఈ పనులు పూర్తయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

రోడ్డు పనులు ఇలా...

భాకరాపేట నుంచి కడప వరకు ఇప్పుడున్న రోడ్డునే నాలుగు లేన్లుగా వేస్తారు. భాకరాపేట నుంచి రైల్వేకోడూరు వరకు ప్రస్తుతం ఉన్న రోడ్డు కాకుండా రైల్వేలైను అవతల అటవీ మార్గం ద్వారా సుమారు 82 కిలోమీటర్ల మేర కొత్త గ్రీన్‌ఫీల్డ్ హైవే రహదారిని ఏర్పాటు చేస్తారు. అదే రైల్వే లైనుకు అవతల పల్లె మార్గాలకు దూరంలో అనగా జనావాసాలకు దూరంగా 82 కిలోమీటర్ల మేర ఇప్పుడున్న రెండు లైన్లు కాకుండా నాలుగు లేన్ల రోడ్డును భాకరాపేట నుంచి కోడూరుకు వేయడం వల్ల ప్రయాణం బాగా సాగుతుంది. అలాగే శెట్టిగుంట నుంచి రేణిగుంట వరకు ప్రస్తుతమున్న రెండు లేన్ల రహదారిని నాలుగు లేన్లుగా ఏర్పాటు చేస్తారు. అయితే ప్రస్తుతమున్న రోడ్డునే నాలుగు లేన్లుగా మారుస్తారు. మొత్తంగా 122 కిలోమీటర్లు ఉన్న ఈ రహదారిలో కడప నుంచి చిన్నఓరంపాడు వరకు 64 కిలోమీటర్ల రోడ్డును, చిన్నఓరంపాడు నుంచి రేణిగుంట వరకు 54 కిలోమీటర్ల మరో రోడ్డును రెండు ప్యాకేజీలుగా ఏర్పాటు చేయనున్నారు. ఈ రెండు ప్యాకేజీల రోడ్డు పనులను గతంలో టెండరు వేసే సమయంలో రూ.3232 కోట్లతో ఈ రోడ్డును లక్ష్మీ ఇన్‌ఫ్రా అనే సంస్థ దక్కించుకుంది. ఈ రోడ్డుకు కేంద్ర వన్యప్రాణుల సంరక్షణ విభాగం అనుమతి ఇచ్చినందున త్వరలో పనులు ప్రారంభించేందుకు జాతీయ రహదారుల సాధికార సంస్థ వెంటనే పనులు ప్రారంభానికి శ్రీకారం చుట్టింది. రోడ్డు అంతా ఒకటిన్నర మీటరు ఎత్తులో నిర్మించనున్నారు. ఈ సందర్భంగా హైవేలో 55 కిలోమీటర్ల మేర 11 చోట్ల భారీ వంతెనలు నిర్మించనున్నారు. ఆయా ప్రాంతాల్లో మండలాలు, ప్రధాన గ్రామాలకు అనుసంధానంగా అప్రోచ్ రోడ్డును కూడా ఏర్పాటు చేయనున్నారు. రోడ్డు కిందనే బ్రిడ్జిలు, కాలువలు ఏర్పాటు చేస్తారు. బాలుపల్లె అటవీ మార్గంలో శెట్టిగుంట నుంచి బాలుపల్లె ప్రాంతంలో వన్యప్రాణులు అటు ఇటు తిరగడానికి రోడ్డు కింద కాలువల రూపేణా మార్గాలు ఏర్పాటు చేస్తారు.

బంగారు దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు


బంగారు నగల దుకాణాన్ని పరిశీలిస్తున్న విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు

పోరుమామిళ్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్లలోని బంగారు దుకాణాలలో గురువారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు తనిఖీలు చేశారు. మహాత్మాగాంధీ విగ్రహం సర్కిల్‌లో ఉన్న బంగారు దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను, సంబంధిత డాక్యుమెంట్లను పరిశీలించారు. ఒక దుకాణంలో తూకాల్లో తేడాలు రావడంతో రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఈదుళ్లపల్లె సమీపంలో ఉన్న రైస్‌మిల్లును తనిఖీ చేశారు. కడప డీసీటీవో గీతావాణి, బాబు, ఎన్ ఫోర్స్‌మెంటు అధికారులు గౌస్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ... వ్యక్తి మృతి



మైదుకూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని వనిపెంట రోడ్డులో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఇందిరమ్మ కాలనీకి చెందిన మునగల వెంకటరమణ (65) సైకిల్‌పై వెలు తుండగా వెంకటేశ్వరా లారీ కాటా వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందాడు. మైదుకూరు పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

రైలు ఢీకొని 28 గొర్రెలు మృతి



సీకేదిన్నె, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రైల్వేక్రిష్ణాపురం వద్ద ప్రమాదవశాత్తు రైలు ఢీకొని గాలిబోయిన సురేంద్రకు చెందిన 28 గొర్రెలు మృతిచెందాయి. గురువారం కడప-కమలాపురం రైల్వే మార్గంలో రైలు వస్తున్న సమయంలో గొర్రెల వైపు కుక్క పరుగెత్తడంతో బెదిరిపోయి ఒక్కసారిగా రైల్వేట్రాక్‌పైకి పరుగెత్తాయి. ఈ ప్రమాదంలో 28 గొర్రెలు మృతి చెందాయి. దాదాపు రూ.4 లక్షలకుపైగా నష్టం వాటిల్లిందని గొర్రెలకాపరి ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

కుక్కల దాడిలో ఆరు గొర్రెలు...



చక్రాయపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.ఎర్రగుడి గ్రామం బీఎన్ తాండాలో కుక్కలు దాడి చేయడంతో ఆరు గొర్రెలు మృతి చెందాయి. గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో గంగేనాయక్‌కు చెందిన గొర్రెల మందపై ఊర కుక్కలు దాడి చేశాయి. గమనించిన అతని కుమారుడు కుక్కలను తరిమేశాడు. అయితే అప్పటికే ఆరు గొర్రెలను చంపేశాయి. గొర్రెల విలువ దాదాపు లక్ష రూపాయలు ఉంటుందని బాధితుడు తెలిపారు. గ్రామంలో దాదాపు 50 కుక్కలు ఉన్నాయని.. వాటి బారి నుంచి రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

మహిళ మెడలోని బంగారు గొలుసు చోరీ

పులివెందుల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భార్య భర్తలు కలసి వాకింగ్ చేస్తుండగా మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి లాక్కెళ్లాడు. వివరాలిలా... పులివెందులకు చెందిన వంకదార సుబ్బారావు తన భార్యతో కలసి పాత జూనియర్ కళాశాల సమీపంలో గురువారం ఉదయం వాకింగ్ చేస్తున్నారు. అదే సమయంలో గుర్తు తెలియని ఓ వ్యక్తి అటువైపు వచ్చి ఉన్నట్లుండి సుబ్బారావు భార్య మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కొని పారిపోయాడు. బంగారు గొలుసు లాగే సమయంలో ఆ మహిళ గట్టిగా పట్టుకోవడంతో కొంత మేర తెగిపోయింది. కొంత దొంగ ఎత్తుకుపోగా మిగిలిన గొలుసు ఆమె చేతికి వచ్చింది. తులం మూడు గ్రాముల బంగారు గొలుసును దొంగ ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు.

లారీని ఢీకొన్న మరో లారీ

ముద్దనూరు నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి కడప-తాడిపత్రి జాతీయ రహదారిలోని చింతకుంట సమీపంలో గురువారం ఉదయం నిలబడి ఉన్న లారీని వెనుక వైపు మరో లారీ ఢీకొడంతో లారీ ముందు భాగంగ దెబ్బతింది. తాడిపత్రి వైపు గ్రానైట్ రాయిని తీసుకువస్తున్న లారీ చింతకుంట సమీపంలో మరమ్మత్తుకు గురవడంతో డ్రైవర్ రోడ్డు పక్కన నిలిపాడు. అదే వైపు నుంచి మరో లారీ అతి వేగంగా వచ్చి ఢీకొనడంతో లారీ క్యాబిన్ ఎడమ వైపు దెబ్బతింది. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు.

వరిపంటను నాశనం చేసిన అడవిపందులు


నాశనం చేసిన వరిపైరు వద్ద రైతు

కలసపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తాను ఎంతో కష్టపడి పండించుకున్న వరి పంటను అడవి పందు లు నాశనం చేశాయని సింగరాయపల్లె గ్రామా నికి చెందిన భాస్కర్ (ఆసాది) అనే రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఒకటిన్నర ఎకరంలో రూ.50వేలు ఖర్చుచేసి వరిపైరును సాగుచేసినట్లు తెలిపారు. వారం రోజుల్లో పంటను కోయాల్సి ఉండగా గురువారం తెల్లవారుజామున దాదాపు ఒకటిన్నర ఎకరాకు పైగా పంటను తొక్కి పాడు చేశాయని వాపోయారు.

ఉల్లాసంగా జిల్లా స్థాయి పారా అథ్లెటిక్స్ క్రీడలు


ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను సత్కరిస్తున్న దృశ్యం

కడప స్పోర్ట్స్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక డీఎస్‌ఏ స్టేడియంలో జిల్లా స్థాయి పారా అథ్లెటిక్స్ క్రీడా పోటీలు నిర్వహించారు. ఇందులో బ్యాడ్మిం టన్, చెస్, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలలో పలువురు బాల, బాలికలు హాజరై ఉల్లాసంగా పాల్గొన్నారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎస్.గౌస్‌బాషా ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడాపోటీలను విభిన్న, టీజీ, సీనియర్ సిటిజన్ల అధికారి ఆర్‌వీ కృష్ణకిశోర్, పారా అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా కార్య దర్శి దామోదర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ (డబుల్స్-సింగిల్) క్రీడలలో ప్రతిభ కనబరచిన 10 మంది ఎంపిక చేశారన్నారు. వీరు గుంటూరు డీఎస్‌ఏ మైదానంలో డిసెంబరు 1, 2 తేదీలలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. వాలీబాల్, అథ్లెటిక్స్, చెస్ పోటీలలో ప్రథమ, ద్వితీయ విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్స్ మైదానంలోనే అందజేశారు. కాగా చివరగా రాష్ట్ర, జాతీయ స్థాయిలో పారా అథ్లెట్ల విజేతగా నిలిచిన ఉప్పు అభినవ్‌తో పాటు జిల్లా పారా క్రికెట్ క్రీడాకారుడు వై. వెంకటసుబాస్, బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పి.ఓబులేసు (జాషువా)లను సత్కరించారు.

ప్రారంభమైన పీజీ పరీక్షలు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేషన్ తృతీయ సెమిస్టర్ పరీ క్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు 91శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. వైవీయూ పోస్ట్ గ్రాడ్యు యేషన్ తృతీయ సెమిస్టర్ పరీక్షలకు 490 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 450 మంది విద్యార్థులు హాజరు కాగా, 40 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ కేఎస్‌వీ కృష్ణారావు అకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ కాత్యాయని మార్గదర్శకంలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. అబ్జర్వర్ డాక్టర్ కె.మృత్యుంజయరావు పర్యవేక్షించారు. పరీక్షల నిర్వహణలో అసిస్టెంట్ చీఫ్ సూపరిం టెండెంట్ డాక్టర్ మునికు మారి, సిబ్బంది ఉన్నారు.

పర్వతారోహణ క్యాంప్‌లతో ఆత్మవిశ్వాసం పెంపు


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పర్వతారోహణం క్యాంప్‌లు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రధాన ఆచార్యులు డాక్టర్ జి.రవీంద్రనాథ్ అన్నారు. నవంబరు 10వ తేదీ నుంచి 21వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో జాతీయస్థాయిలో నిర్వహించిన పర్వతారోహణం క్యాంప్‌లో ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొని ప్రతిభ కనబరిచిన ఎన్‌సీసీ క్యాడెట్లు బీఎస్సీ కంప్యూటర్స్ సైన్స్ విద్యార్థి సయ్యద్ అలీ, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విద్యార్థి మహమ్మద్‌లను కళాశాలలోని ప్రిన్సిపాల్ అభినందించారు. ఎన్‌సీసీ అధికారులు కెప్టెన్ డాక్టర్ నీలయ్య, లెఫ్టినెంట్ మహేష్, డాక్టర్ సురేష్‌బాబు, డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, క్యాడెట్లు పాల్గొన్నారు.

షార్ట్ టర్మ్ ప్రొఫెషనల్ సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యాశాఖ ఆంధ్రప్రదేశ్ 2025-26 విద్యాసంవత్సరానికి షార్ట్‌టర్మ్ ప్రొఫెషనల్ సర్టిఫికెట్ కోర్సులు (ఎస్‌టీపీసీ) ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ప్రభుత్వ మహిళ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా నోడల్ ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి తెలిపారు. ఈ కోర్సులకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు నవంబరు 28 నుంచి డిసెంబరు 10వ తేదీ మధ్య ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో అభ్యర్థులు రూ.400 ఫీజును చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. పూర్తి సమాచారాన్ని అధికారిక వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చని సూచించారు.

'అన్నమయ్య జిల్లాలో మమ్మల్ని చేర్చవద్దు'


డీఆర్‌వోకు వినతి పత్రం అందజేస్తున్న పెద్దపల్లి పంచాయతీ నాయకులు

కడప మారుతీనగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కడప నగరానికి కూతవేటు దూరంలో ఉన్న సిద్దవటం మండలంతో పాటు పెద్దపల్లి పంచాయతీని యధాతథంగా కడప జిల్లాలోనే ఉంచాలని ఆ గ్రామ పంచాయతీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఆ మేరకు గురువారం కడప కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ విశ్వేశ్వరనాయుడును కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. మా గ్రామ పంచాయతీ హద్దులు కడప కార్పొరేషన్‌కు సమీపంలో ఉండడంతో అధికారులను గంటలోపే కలిసి పనులు చేసుకుంటున్నామన్నారు. ఇప్పుడు పంచాయతీని అన్నమయ్య జిల్లాలో చేర్చడం వలన జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే 80 కిలోమీటర్లు పోవాల్సి వుంటుందన్నారు. దీంతో చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం స్పందించి సిద్దవటం మండలాన్ని కడప జిల్లాలోనే యథాతథంగా ఉంచాలని కోరారు.

నేటి నుంచి స్కూల్ బస్సుల తనిఖీ

సీకేదిన్నె, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం శుక్రవారం నుంచి డిసెంబరు 4వ తేదీ వరకు స్కూలు బస్సులు తనిఖీ చేయనున్నట్లు ఇన్‌చార్జి ఉప రవాణా కమిషనర్ ఎం.వీర్రాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే పాఠశాల యాజమాన్యాలకు ఈ తనిఖీలపై తెలియజేశామని, లోటుపాట్లపై సవరణ చేసుకోవాలని అన్ని విద్యాశాఖ కార్యాలయాలకు నోటీసులు కూడా పంపించామన్నారు. తనిఖీల్లో అగ్నిమాపక పరికరాలు, ఎమర్జెన్సీ ఎగ్జిట్, వాహనాల పనితీరు సమగ్రంగా తనిఖీ చేస్తామన్నారు. యాజమాన్యాలు బస్సుకు సంబంధించిన వివరాలను అందుబాటులో ఉంచి రవాణా శాఖకు సహకరించాలని కోరారు.

జాతీయ హాకీ జట్టుకు సాయి మోహన్ ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కడప నగరం మున్సిపల్ ఉన్నత పాఠశాల (మెయిన్) విద్యార్థి సాయిమోహన్ 69వ ఎస్‌జీఎఫ్ అండర్-19 బాలుర విభాగంలో జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. గురువారం మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో ప్రధానోపాధ్యాయురాలు ముబీన రెహనా విద్యార్థిని అభినందించారు. ఈనెల 20 నుంచి 24 వరకు వైజాగ్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో సాయి మోహన్ చక్కటి ప్రతిభ కనబ రచడంతో జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. త్వరలో రాజ స్థాన్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారని తెలిపారు.

కడప జిల్లా వాసికి అరుదైన గుర్తింపు



కడప మారుతీనగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన 100 కాంపిటీటివ్ ఇంగ్లీష్ ఫ్యాకల్టీలలో కడప జిల్లాకు చెందిన ఎం.రత్నంకు అరుదైన గుర్తింపు దక్కింది. ఢిల్లీకి చెందిన నీతి అయోగ్, రాష్ట్రీయ నైతికత సమ్మాన్ వారు 2025 సంవత్సరానికి దేశ వ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో ప్రసిద్ధిగాంచిన 100 కాంపి టీటివ్ ఇంగ్లీష్ ఫ్యాకల్టీ సర్వేలో కడప నగరం ఆలంఖాన్ పల్లెకు చెందిన రత్నంకు చోటు లభించింది. అందుకు గాను ఆయనకు కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రశంసాపత్రం అందజేశారు.

ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన

ఖాజీపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఖాజీపేట మోడల్ స్కూల్లో ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుడు ఓ విద్యార్థినికి ప్రేమలేఖ రాయడంతో పాటు అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీనిపై సహచర విద్యార్థులు ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఈ విషయాన్ని బయటకు పొక్కకుండా ఆ ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకున్నట్లు సమాచారం. కాగా ఈ విషయమై పాఠశాల ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా ఉపాధ్యాయుడికి గత నాలుగు రోజులుగా మతిస్థిమితం బాగాలేదని, దాంతో ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామని తెలిపారు.

తార ప్లాంట్‌లో వస్తువులు కాల్చివేత

ముద్దనూరు నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి చిన్న దుద్యాల గ్రామ సమీపంలో నున్న తార ప్లాంట్‌లో వస్తువులను బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కాల్చివేసినట్లు ఎస్‌ఐ మైనుద్దీన్ తెలిపారు. రాత్రి ప్లాంట్‌లో నున్న గదిలో సెక్యూరిటీ గార్డు నిద్రపోతుండగా గుర్తుతెలియని వ్యక్తులు గదికి తాళం వేసి, ప్లాంట్‌లోని వస్తువులకు నిప్పు పెట్టి కాల్చివేశారు. ప్లాంట్ సూపర్‌వైజర్ కొర్రపాటి ప్రతాపరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి


వైద్యశిబిరం ప్రారంభిస్తున్న ఎస్పీ నచికేత్

కడప క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నిరంతరం విధుల్లో ఉండే పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి.. సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ సూచించారు. గురువారం నగరంలోని జిల్లా పోలీసు సంక్షేమ ఆసుపత్రిలో హైదరాబాదుకు చెందిన చిరంజీవి హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చిరంజీవి హాస్పిటల్స్‌కు వారు సామాజిక బాధ్యతగా పోలీసు సిబ్బందికి వైద్యశిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పోలీసులు ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలరన్నారు. పోలీసు కుటుంబాలు, రిటైరైన పోలీసు సిబ్బంది, వారి కుటుంబాలు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య శిబిరంలో నిపుణులైన వైద్యుల ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. డాక్టర్ కె.సంజీవరావు, శిల్పపొన్నాడ, క్రిష్ణవంశీ, జయశ్రీ, సిద్దార్థరెడ్డి శిబిరంలో పాల్గొన్నారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ప్రకాశ్‌బాబు, ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య, ఏఆర్ డీఎస్పీ నాగేశ్వర్‌రావు, పోలీసు యూనిట్ డాక్టర్ రేష్మ, ఆర్ఐ శ్రీశైలరెడ్డి, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పుశంకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పదవ తరగతి విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

బి.కొత్తకోట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శంకరాపురం జడ్పీ హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. పరిస్థితిని గమనించిన కుటుంబీకులు హుటా హుటిన ఆ బాలికను బి.కొత్తకోట ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆ బాలిక పరిస్థితి విషమంగా ఉన్నందున తిరుపతికి తరలించాలని అక్కడి వైద్యులు సూచించినట్లు తెలుస్తోంది. ఆమె కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు....

పీటీఎం మండలం బూచిపల్లి గ్రామానికి చెందిన విజయభాస్కర్ కుమార్తె జానకీరాణి తమ గ్రామానికి సమీపాన ఉన్న బి.కొత్తకోట మండల పరిధిలోని శంకరా పురం జడ్పీ హైస్కూల్ పదవ తరగతి చదువుతోంది. కాగా ఇటీవలి కాలంలో ఆ విద్యార్థిని వ్యక్తిగత కారణాలతో పాఠశాలకు సక్రమంగా వెళ్లలేకపోయింది. గురువారం వెళ్లింది. ఇన్ని రోజులుగా ఎందుకు రావడం లేదని తోటి విద్యార్థుల ముందు ఉపాధ్యాయులు ఆమెను తీవ్ర పదజాలంతో మందలించడంతో పాటు తరగతి బయట నిలబెట్టారు. దీంతో విద్యార్థిని మనస్తాపం చెందింది. స్కూలు వదిలిన తర్వాత పురుగుల మందు తాగేసి, బూచిపల్లిలోని స్వగృహానికి వెళ్లింది. అప్పటికే అపస్మారక స్థితిలోకి వెళ్లిన బాలికను కుటుంబీకులు ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై సరైన సమాచారం ఇచ్చేందుకు సంబంధిత అధికారులు అందుబాటులోకి రాలేదు. జిల్లా విద్యాశాఖాధికారులు సైతం వివరాలను ఆరా తీశారు. ఈ విషయంలో ఉపాధ్యాయుల ప్రమేయం ఏమాత్రం లేదని సంబంధిత ఉపాధ్యాయ సిబ్బంది పేర్కొంటున్నట్టు తెలిసింది.

బతికి ఉండగానే... భార్యకు డెత్ సర్టిఫికెట్

● భర్తపై పోలీసులకు ఫిర్యాదు



కలసపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తాను బతికి ఉండగానే చనిపోయినట్లు తన భర్త డెత్ సర్టిఫికెట్ కొరియర్ ద్వారా పంపాడని ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కలసపాడు మండలం దూలం వారిపల్లెకు చెందిన ఆదిలక్ష్మి అనే మహిళ గురువారం న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించింది. గ్రామానికి చెందిన అంకయ్య, ఓబు శమ్మల కుమార్తె ఆదిలక్ష్మిని 18 సంవత్సరాల క్రితం ముద్దనూరుకు చెందిన పొన్నా మారుతి రాజుకు ఇచ్చి వివాహం చేశారు. వారికి ముగ్గురు మగపిల్లలు ఉన్నారు. గత కొన్ని రోజుల నుంచి భార్య భర్తల మధ్య చిన్నచిన్న గొడవలు జరుగుతుండేవి. విసుగు చెందిన ఆమె 15రోజుల క్రితం స్వగ్రామమైన కలసపాడు మండలం దూలంవారిపల్లెకు చేరుకుంది. గురువారం కొరియర్ ద్వారా వచ్చిన డెత్ సర్టిఫికెట్‌ను గ్రామస్థుల ద్వారా తెలుసుకున్న ఆమె అవాక్కైంది. విషయం తల్లితండ్రులకు తెలిపి కలసపాడు పోలీసులను ఆశ్రయించి తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేసింది. సర్టిఫికెట్ ఎవరు ఇచ్చారు, అది ఎంత వరకు నిజమైంది, ఎవరు పంపారు అనే విషయం పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

భార్య రాకపోవడంతోనే...

తన భార్య ముగ్గురు పిల్లలను వదిలి పోయిందని.. చాలా సార్లు తమ వద్దకు రావాలని చెప్పినా వినకపోవడంతోనే.. తన తల్లి పేరుతో ఉన్న డెత్ సర్టిఫికెట్‌ను మార్పు చేసి పంపాల్సి వచ్చిందని మారుతి రాజు తెలిపాడు.

ఆలయ భూముల వేలం

● రూ.1.60 లక్షల ఆదాయం



ఆలయ భూములు వేలం నిర్వహిస్తున్న అధికారులు

నిమ్మనపల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని తవళం అటవీప్రాతంలో వెలసిన నేలమల్లేశ్వ స్వామి ఆలయానికి సంబంధించిన భూముల వేలంపాటను గురువారం ఈవో మంజుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు 19 సర్వే నెంబర్లలో వున్న భూమిని వేలంపాట నిర్వహించగా వాటిలో సర్వే నెంబరు 600ఏ లో వున్న భూమి మాత్రం ఏడాదికి రూ.50 వేలు మిగిలిన సర్వే నెంబర్లు 567, 591, 596.1, 297, 240 మాత్రం కేవలం ఏడాదికి రూ.3500లు పలికింది. మిగిలిన మామిడితోటలు ఇతర సర్వే నెంబర్లలో గల భూములు కూడా వాయిదా వేస్తున్నట్లు ఈవో తెలిపారు. అయితే ప్రస్తుతం మూడు సంవత్సరాలకు గానూ రూ.1.65 లక్షలు ఆలయానికి ఆదాయం వచ్చినట్లు తెలిపారు. వచ్చిన ఆదాయాన్ని ఆలయ అభివృద్ధి కొరకు వినియోగించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డెప్ప, మాజీ సర్పంచ్ రాజన్న, చిన్నరెడ్డెప్ప, రెడ్డిమోహన్, మణి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు పడిపూజ కార్యక్రమం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

మదనపల్లెఅర్బన్, నవంబరు 27 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని చిప్పిలి గ్రామంలో వెలసిన అయ్యప్ప స్వామి ఆలయంలో ఈ నెల 29న అయ్యప్ప పడి పూజ నిర్వహిస్తున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. గురువారం ఆలయంలో పడిపూజ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయాన్నే గణపతి హోమం, కలశాభిషేకం అనంతరం పడిపూజ, పుష్పాభిషేకం వైభవంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోనే అతిపెద్ద దేవాలయంగా ప్రసిద్ధిగాంచిందన్నారు. పడిపూజ కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు, ప్రజలు, పుర ప్రముఖులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి అన్నదానం కార్యక్రమంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు మార్వారి సుధాకర్ నాయుడు, జర్నలిరాజు, శివమూర్తి, ఆనందనాయుడు, భగవాన్, వేణుగోపాల్, ముద్దుకృష్ణ, రవి, యోగి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ

కురబలకోట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): హాస్టల్ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని సీఐ రవినాయక్, ఎస్ఐ మధురామచంద్రుడులు పేర్కొన్నారు. గురువారం మండలంలోని అంగళ్లు సమీపంలోని డీమ్డ్ టు బి మిట్స్ యూనివర్శిటీలో ప్రైవేట్ హాస్టల్స్ యాజమాన్యం, కళాశాల యాజమాన్యంతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్స్‌లో క్రమశిక్షణ వాతావరణం కల్పించా లని, విద్యార్థులకు సంబంధించి పూర్తి వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. హాస్టల్స్‌లో ర్యాగింగ్ వంటి దుశ్చర్యలకు పాల్పడకుండా జాగ్రత్తలు చేపట్టడంతో పాటుగా బాధ్యతగా వ్యవహరింన్నారు. విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది మారుతీ ప్రసాద్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహితంగా మున్సిపల్ కార్యాలయం

● మున్సిపల్ కమిషనర్ ప్రమీల ప్రకటన



స్టీల్ వాటర్ ఫ్లాస్కులు చేతబట్టి మున్సిపల్ అధికారులతో కమిషనర్ ప్రమీల

మదనపల్లె, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఇక నుంచి మున్సిపల్ కార్యాలయాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలని కమిషనర్ కె.ప్రమీల ప్రకటించారు. ఆ మార్పు అనేది మన నుంచే మొదలు పెట్టాలని, అందుకే కార్యాలయంలో ఎక్కడా ప్లాస్టిక్ వస్తువుల వినియోగం లేకుండా చూడాలన్నారు. అందుకే ఇక్కడి నుంచే అమలు చేస్తామని వెల్లడించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ సహకారంతో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కమిషనర్ ఈ మేరకు నిర్ణయం తీసుకుని పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు, సిబ్బందికి స్టీల్ వాటర్ బాటిళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ రీసోర్స్ పర్సన్ రమాదేవి, జయమధురిమ, జిల్లా కో-ఆర్డినేటర్లు, శానిటరీ సూపర్‌వైజర్ వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలి

పెద్దమండ్యం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ సేవాభావం కలిగి వుండాలని మండలంలోని కలిచెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అమరేంద్ర కుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఎన్‌వోపల్లిలో ఎన్ఎస్ఎస్ పీఓ వెంకటనరసయ్య ఆధ్వర్యంలో జరగనున్న ఎన్ఎస్ఎస్ ఏడు రోజుల క్యాంప్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ క్యాంప్ వలంటీర్లు సేవా భావాలకు అలవాటు పడతారని తెలిపారు. నాయకత్వ లక్షణాలు వస్తాయన్నారు. గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటడం, వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎస్ఎస్ఎస్ పీఓ వెంకటనరసయ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శి శైలజ, అధ్యాపకులు ముస్తఫా, రవీంద్ర, అంజి, హెచ్ఎం మాధవ తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌వోపల్లిలో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సేవా కార్యక్రమం

ఔను... వాళ్లు అలిగారు

● షాపులు మూసిన స్టాంప్‌రైటర్లు ● బి.కొత్తకోటలో ఆగిన నూతన రిజిస్ట్రేషన్లు



సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద మూతపడిన స్టాంప్‌రైటర్ల షాపులు

బి.కొత్తకోట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట వున్న స్టాంప్‌వెండర్లు, స్టాంప్‌రైటర్లు గురువారం తమ షాపులను మూసివేసి ముఖాలు చాటేశారు. ఈ విషయం పట్టణంలో చర్చనీయాంశమైంది. ఈ స్టాంప్‌రైటర్లు ఇష్టారాజ్యంగా అధిక ధరలకు స్టాంపులను అమ్ముతున్నారన్న ఆరోపణల నేపథ్యంలో కడప డీఐజీ రామలక్ష్మీ పట్నాయక్ వీరి లైసెన్సులు సస్పెండ్ చేయడం వల్ల స్టాంపుల విక్రయం ఆగిందని, స్టాంప్‌రైటర్లు రిజిస్ట్రేషన్ మొత్తంలో 1శాతం లంచంగా వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపించాయి. ఈ నేపథ్యంలో సబ్‌రిజిస్ట్రార్‌కు అక్షింతలు పడ్డాయన్న కారణంగా పరిస్థితి మారిందని చెబుతున్నారు. నూతన రిజిస్ట్రేషన్లకు మునుపటిలా వసూళ్లు చేయలేక, వసూళ్లు లేకుండా సాధారణ రిజిస్ట్రేషన్లు చేయలేక వీరందరూ మూకుమ్మడిగా తమ షాపులను మూసివేసి పక్కకు తప్పుకున్నట్లు చర్చ నడిచింది. సాధారణంగా ఎలాంటి రిజిస్ట్రేషన్ అయినా జనం ఈ స్టాంప్ రైటర్ల వద్దకు వెళ్లి వారు చెప్పినట్లు నడుచుకొని, వారు చెప్పిన పైకం చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. రైతులు స్వయంగా స్లాట్ బుక్ చేసుకొని, స్టాంపులు తయారు చేసుకొని, చలానా కట్టి, ఇరు పార్టీలు హాజరై రిజిస్ట్రేషన్ చేయించుకునేంత చైతన్యం ఇంకా రాలేదు. తాజాగా బి.కొత్తకోట కార్యాలయంలో జరుగుతున్న అక్రమాలపై ఫిర్యాదులు వెళ్లడం, దీనిపై ఉన్నతస్థాయి విచారణ జరగడం, ఫిర్యాదులన్నీ నిజమేనని వాటిపై చర్యలకు సిఫారసులు వెళ్లాయి. దీనిపై కినుక వహించిన స్టాంప్ వెండర్లు, రైటర్లు మూకుమ్మడిగా విధులకు దూరమై షాపులను మూసివేశారు. దీంతో ఓ పద్ధతికి అలవాటు పడిన జనం యథావిధిగా స్టాంప్‌రైటర్ల పైనే ఆధార పడ్డారు. వారు ఎంతకూ రాకపోవడంతో గురువారం రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ముందుకు సాగలేదు. కాగా తమకు విశ్రాంతి కోసం షాపులు మూసేశామని స్టాంప్‌రైటర్లు అంటుండగా, అవినీతి ఆరోపణలు వచ్చినందున జనాన్ని బ్లాక్‌మెయిల్ చేసేందుకు, స్టాంప్‌వెండర్లు, రైటర్లు కలిసి మైండ్‌గేమ్ ఆడుతున్నారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. తదుపరి ఏం జరుగుతుందో వేచి చూడాల్సి వుంది.

ప్రతి ఎకరాకు సాగు నీరందిస్తాం / ● పెద్దేరు ప్రాజెక్టు చైర్మన్ శివకుమార్



ఆయకట్టు రైతులతో సాగునీటి సంఘం చైర్మన్ శివకుమార్, కమిటీ సభ్యులు

తంబళ్లపల్లె, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొటాల పంచాయతీ పెద్దేరు జలాశయం ఆయకట్టు కింద ఉన్న ప్రతి ఎకరాకు సాగు నీరు అందిస్తామని ప్రాజెక్టు సాగు నీటి సంఘం చైర్మన్ శివకుమార్ అన్నారు. గురువారం ప్రాజెక్టు వద్ద చైర్మన్, కమిటీ సభ్యులు ఆయకట్టు రైతులతో కలిసి సాగు నీటి విడుదలకు సమీక్ష నిర్వహించారు. 2025-26 రబీ సీజన్‌కు ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల ద్వారా సాగు నీటి విడుదలకు చేపట్టాల్సిన చర్యలు, కాలువల కింద ఉన్న ప్రస్తుత సాగు, ఏఏ పంటలు సాగులో ఉన్నాయి, ఆయకట్టు రైతుల సమస్యలు తదితర విషయాలను చర్చించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... తంబళ్లపల్లె, పెద్దమండ్యం మండలాల రైతులకు జీవనాడిగా ఉన్న పెద్దేరు ప్రాజెక్టు ఇటీవల కురిసిన వర్షాలకు పరవళ్లు తొక్కుతోందన్నారు. ప్రాజెక్టు కాలువల కింద మొత్తం సుమారు 4,500 ఎకరాల ఆయకట్టు ఉందని తెలిపారు. కార్యక్రమంలో లష్కర్ శ్రీనివాసులు, ఆయకట్టు సంఘం సభ్యులు ఓబులేసు, తేజమూర్తి నాయుడు, గంగిరెడ్డి, శివ నాగిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు కృష్ణమూర్తి నాయుడు, రాము, పి.రాజన్న, ఎద్దుల నరసింహులు, మల్లికార్జున, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయమా.. వైసీపీ కార్యాలయమా ?



ఎంపీడీవో సమావేశ మందిరంలో ప్రెస్‌మీట్ నిర్వహిస్తున్న వైసీపీ నేత నిస్సార్‌అహ్మద్

మదనపల్లెటౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు సమీక్ష సమావేశాలు నిర్వహించాలే తప్ప, ఇతరువులోనికి ప్రవేశించి రాజకీయ ప్రసంగాలు చేయకూడదన్న స్పష్టమైన నిబంధన వుంది. కాని గురువారం మదనపల్లె ఎంపీడీవో కార్యాలయంలో మదనపల్లె వైసీపీ ఇన్‌చార్జి నిస్సార్‌అహ్మద్ ఏకంగా ప్రెస్‌మీట్ నిర్వహించి అధికారులను ముక్కున వేలేసుకునేలా చేశారు. ఎంపీ మిథున్‌రెడ్డి ఎంపీడీవో కార్యాలయంలో వైసీపీ నాయకులతో సెల్ఫీలు తీసుకుంటుండగా, సమావేశ మందిరంలో వైసీపీ ఇన్‌చార్జి నిస్సార్ అహ్మద్ మున్సిపల్ చైర్మన్ మనూజ, వైస్ చైర్మన్ జింకా వెంకటచలపతిలతో కలసి ప్రెస్‌మీట్ నిర్వహించారు. రాజకీయ ప్రసంగం చేస్తూ ఎంపీడీవో కార్యాలయాన్ని వైసీపీ కార్యాలయంగా మార్చేశారు. దీనిపై ఎంపీడీవో, అధికారుల చర్యలు ఏపాటికి వుంటాయో ఎదురుచూడాల్సి వుంది.

'రాష్ట్ర అధ్యక్ష పదవికి అవకాశం ఇవ్వండి'

పెద్దమండ్యం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర టీడీపీ ఎస్టీసెల్ ప్రెసిడెంట్‌గా తనకు అవకాశం కల్పించాలని ఆ విభాగం కార్యదర్శి మనోహర్ నాయక్ కోరారు. గురువారం విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసులును కలసి వినతిపత్రం అందజేశారు. పెద్దమండ్యం మండలానికి చెందిన మనోహరనాయక్ 2014 నుంచి టీడీపీ ఎస్టీసెల్ గ్రామ, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా, 2021-18 వరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా తెలుగు యువత కార్యనిర్వాహణ కార్యదర్శిగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కూటమి ప్రభుత్వం రావాలని అనేక పోరాటాలు చేసినట్లు రాష్ట్ర టీడీపీ ఎస్టీసెల్ కార్యదర్శి తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

మదనపల్లెఅర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మదనపల్లె వన్ డిపోలో శుక్రవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ డిపో డీఎం వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. ఈ సమయంలో ప్రయాణీకులు డిపో పరిధిలో ఆర్టీసీ ఉద్యోగుల వలన, సర్వీసులపై ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలన్నారు. అలాగే ఆర్టీసీ ఆదాయం పెంచుకోవడానికి సూచనలు, సలహాలు ఇవ్వదలిచిన వారు 9959225676ను సంప్రదించాలని డీఎం తెలిపారు.

కోదండరామాలయం పునర్నిర్మాణం



ఆలయ పున:నిర్మాణ పూజలో పాల్గొన్న శ్రీరామ్ చినబాబు

మదనపల్లెఅర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పోతబోలు గ్రామం హరిజనవాడలోని కోదండ రామాలయ పున: నిర్మాణం కోసం రూ.45 లక్షలు మంజూరు చేసింది. గురువారం మదనపల్లె మండలం, పోతబోలుగ్రామం, హరిజనవాడలో కోదండ రామాలయ నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన భూమి పూజా కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు చినబాబు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సనాతన ధర్మాన్ని, ఆధ్యాత్మికతను పెంపొందించడానికి కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు గ్రామీణ ప్రాంతాల్లో ఆలయాలు నిర్మాణాలకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగానే నూతన ఆలయం నిర్మించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో హజ్ కమిటీ సభ్యుడు పఠాన్ ఖాదర్‌ఖాన్, ఎస్ సుధాకర్, వెంకటేశ్, కేశవరెడ్డి, వెంకటరమణ, మహబూబ్‌ఖాన్, శివాలయ డైరెక్టర్ వరప్రసాద్, జేసీ రెడ్డెప్ప, బీజేపీ యువ నాయకుడు శ్రీకాంత్, గ్రామస్థులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేయాలి

● మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శనం



జిల్లా ఆస్పత్రి వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

మదనపల్లె అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రేమజంట విషయంలో మద్దతుగా వెళ్లిన వ్యక్తిని చితకబాదిన కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేయాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శనం డిమాండ్ చేశారు. గాయాలతో మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకటేశ్‌ను మాలమహానాడు నాయకులు గురువారం పరామర్శించారు. అనంతరం జిల్లా ఆస్పత్రి ముందు బాధితునితో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సుదర్శనం మాట్లాడుతూ రామసముద్రం మండలం, చెంబకూరుకు చెందిన వెంకటేశ్ కుమారుడు మణి, అదే గ్రామానికి చెందిన ఓ అమ్మాయిని గత 15 రోజుల క్రితం తీసుకెళ్లాడని రామసముద్రం పోలీస్‌స్టేషన్‌లో అమ్మాయి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ విషయంగా మణి తండ్రిని విచారణ కోసం పిలిచి చిత్రహింసలు పెట్టారని వాపోయారు. ఈ భరత్ కానిస్టేబుల్‌ను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు చంద్రయ్య, గుండా మనోహర్, మల్లెల మోహమన, లక్ష్మీపతి, ప్రశాంత్, హరినారాయణ, భాస్కర్, కృష్ణమూర్తి, గంగరాజు, గంగాధర్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠ

కలకడ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎర్రకోటపల్లి గొల్లపల్లిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠను గురువారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అర్చకులు రఘుస్వామి జలాధివాసం, శయ్యాదివాసం, పుష్పాదివాసం, ప్రతిష్ఠ తదితర పూజ కార్యక్రమాలు చేపట్టారు. సమీప గ్రామాల ప్రజలు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. దాతలు భూదేవి, శంకరతో పాటు నాగరాజస్వామి పాల్గొన్నారు.

జీవిత బీమా సదుపాయం కల్పించాలి

పీలేరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సాధారణ ప్రజల మాదిరిగా దివ్యాంగులకు కూడా జీవిత బీమా సదుపాయం కల్పించాలని పీలేరులోని ఆదర్శ దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పీవీ చలపతి ఎల్ఐసీ అధికారులను కోరారు. ఈ మేరకు ఆయన గురువారం పీలేరు ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ రాధాకృష్ణకు వినతిపత్రం అందజేశారు. సంపాదనపరులైన దివ్యాంగులకు ఏదైనా జరిగితే వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడతాయని, తమ సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని జీవిత బీమా కల్పించాలని కోరారు.

రీజియన్‌లో ప్రథమస్థానం

మదనపల్లె అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రీజియన్‌లో మదనపల్లె వన్ డిపో ప్రథమస్థానంలో నిలిచిందని ఆ డిపో మేనేజరు వెంకటరమణారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక డిపో ఆవరణంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ మదనపల్లె వన్ డిపోను నవంబరు మాసంలో ఎర్నింగ్, కేఎంపీఎల్‌లో మొదట స్థానంలో నిలిపినందుకు ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. ఉద్యోగుల సమష్టి కృషితో ఇది సాధ్యమౌతోందని పేర్కొన్నారు. ఎంఎఫ్ రవి, గ్యారేజ్ సూపర్‌వైజరు, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ముమ్మరంగా 'రైతన్నా మీకోసం' సర్వే

పెద్దతిప్పసముద్రం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతన్నా... మీకోసం కార్యక్రమం మండలంలోని ఆయా గ్రామాల్లో ముమ్మరంగా సాగుతున్నట్లు మండల వ్యవసాయాధికారి ప్రేమలత పేర్కొన్నారు. గురువారం మండలంలోని కాట్నగల్లు గ్రామంలో నిర్వహిస్తున్న రైతన్నా.. మీకోసం కాట్నగల్లు వ్యవసాయ శాఖ సహాయకుడు హరిబాబు సచివాలయ సిబ్బందితో కలిసి గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలు, వ్యవసాయం, పాడిపరిశ్రమ, అనుబంధ రంగాల్లో ప్రకృతి వ్యవసాయం, పశుగ్రాస పెంపకంపై నూతన సాంకేతిక పద్ధతులతో పాటు వ్యవసాయ సంబంధిత సమస్యలను సిబ్బంది రైతులకు ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బందితో పాటు రైతులు పాల్గొన్నారు.

ఎన్‌జీవో అధ్యక్షుడిగా రాజేష్



వాల్మీకిపురంలో ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గం

వాల్మీకిపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం తాలూకా యూనిట్ ఎన్‌జీవోల సంఘం నూతన అధ్యక్షుడిగా వి.రాజేష్ ఎన్నికయ్యారు. జిల్లా రాష్ట్ర సంఘం నాయకుల సమక్షంలో ఎన్నిక జరిగింది. నూతన అధ్యక్షుడిగా వి.రాజేష్, సహాధ్యక్షుడిగా నాగరాజు, ఉపాధ్యక్షుడిగా మొహమ్మద్‌రఫీ, రెడ్డిప్రసాద్, సలీమ్, ధనలక్ష్మి, కార్యదర్శిగా గంగాధర, సంయుక్త కార్యదర్శులుగా ప్రమీలాదేవి, మహేష్, కళా మజాద్, వరలక్ష్మి, కోశాధికారిగా ఎస్ఎన్.కిషన్, తదితర సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర సంఘ నాయకుల సమక్షంలో నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో కడప జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్‌యాదవ్, అన్నమయ్య జిల్లా చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, కడప జిల్లా కన్వీనర్ శ్రీనివాసన్, నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

దారి ఆక్రమణను ఆపాలంటూ ఆందోళన



దారి వద్ద ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

పీలేరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తమ ప్రాంతానికి ఉన్న దారి ఆక్రమణను అడ్డుకోవాలని కోరుతూ పీలేరులోని వీఎస్ఎన్ సిద్ధార్థ పాఠశాల, నాగిరెడ్డి కాలనీ వాసులు, పలువురు తల్లిదండ్రులు గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సర్వే నెం.660లోని ప్రభుత్వ భూమిలో గతంలో నాగిరెడ్డి కాలనీ, వీఎస్ఎన్ సిద్ధార్థ పాఠశాలకు వెళ్లేందుకు 30 అడుగుల మేర రోడ్డు వదిలారన్నారు. దీంతో పంచాయతీ వారు మురుగునీటి కాలువల కోసం 10 అడుగుల స్థలం వదిలి 20 అడుగుల మేర సిమెంటు రోడ్డు నిర్మించారన్నారు. అయితే ఇటీవల రోడ్డుకు ఆనుకుని ఉన్న భూమిలో కొంత మంది నిర్మాణాలు చేపడుతూ పంచాయతీ వారు వదిలిన స్థలాన్ని ఆక్రమించి రోడ్డును తగ్గించేశారన్నారు. దీంతో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. పంచాయతీ, రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకుని రోడ్డు స్థలాన్ని కాపాడాలని వారు అధికారులను కోరారు.

లోకేశ్‌ను కలిసిన మైనార్టీ నాయకులు



మంత్రి లోకేశ్‌ను కలిసిన మైనార్టీ నాయకులు

వాల్మీకిపురం, నవంబరు 27 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని రాజంపేట టీడీపీ పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సయ్యద్ షబ్బీర్ పేర్కొన్నారు. వాల్మీకిపురానికి చెందిన మైనార్టీ నాయకులు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి లోకేష్‌ను కలిశారు. మదనపల్లె జిల్లా కోసం కృషి చేసిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, పీలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు పట్టువదలని విక్రమార్కుడిగా పనిచేసిన ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్‌షఫి, నాయకులు సిద్ధిక్, బషీర్, షకీల్, జావీద్, షబ్బీర్‌ఆలీ పాల్గొన్నారు.

పేదలకు వాటర్ క్యాన్ల పంపిణీ



పేదలకు వాటర్ క్యాన్‌లను పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు

బి.కొత్తకోట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు ఆలేటిపల్లి రోడ్డులోని గుడిసెలలో ఉంటున్న 30 కుటుంబాలతో పాటు, పట్టణంలోని పోకనాటి వీధిలో నివాసం వుంటున్న దాదాపు వంద మంది మహిళలకు వాటర్ క్యాన్లను అందించారు. ప్రతి ఒక్కరికీ క్యాన్ నీటితో సహా స్థానికంగా వున్న అహ్లేహదీస్ తౌహీద్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు వితరణ చేశారు. పట్టణ మాజీ ఉపసర్పంచ్ పాగొండ సమీవుల్లా ఆధ్వర్యంలో జరిగిన రూ.20 వేల విలువ చేసే వాటర్ క్యాన్‌లను పేదలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో మసీదు ప్రెసిడెంట్ ఖాజాపీర్, చిట్టాగంగిరెడ్డి, అమీర్‌బాష పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం కృషితోనే జిల్లా ఏర్పాటు



మదనపల్లికి ర్యాలీగా వెళుతున్న కూటమి నేతలు

నిమ్మనపల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కృషితోనే మదనపల్లిని జిల్లాగా ప్రకటించడం సాధ్యపడిందని మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటరమణ పేర్కొన్నారు. గురువారం స్థానిక బస్టాండు నుంచి వందలాది కార్యకర్తలు, నాయకులు కాశీపురం మీదుగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు సంఘీభావంగా స్వాగతం పలుకుతూ మదనపల్లికు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కూటమి నేతలు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా మదనపల్లిని జిల్లా ప్రకటిస్తారని ఊహాగానాలు వినిపించినప్పటికీ గత వైసీపీ ప్రభుత్వం అడ్డుకొందని తెలిపారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎన్నికల హామీని నిలబెట్టుకుందని ఆనందోత్సాహాలతో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ వసంతమునిరత్నం, మాజీ మండల అధ్యక్షుడు రాజన్న, సర్పంచ్ రెడ్డెప్ప, మహ్మద్ రఫి, శ్రీపతి, లక్ష్మన్న, నరేంద్ర, సుధాకర్, బాషా, కూటమి నేతలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పీలేరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తమ కళాశాలలో గణిత అతిథి అధ్యాపకుడి పోస్టు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీలేరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సుధాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంఎస్సీ (మ్యాథ్స్)లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు ఈ నెల 29 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. డిసెంబరు 1న ఉదయం 10 గంటలకు కళాశాలలో డెమో క్లాసు నిర్వహిస్తామన్నారు.